# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జన రిపోర్టర్ – జన శ్రేయస్సే మా బాధ్యత



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 01 సంచిక : 354, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ ఆదివారం -27 - ఏప్రిల్ - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## భారత్-పాక్ ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు.. మధ్యవర్తిత్వానికి నిరాకరణ



2లో

భారత్-పాక్ సరిహద్దు ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

ఈసారి మధ్యవర్తిత్వానికి సుముఖత చూపని ట్రంప్

సమస్యను ఇరు దేశాలు పరిష్కరించుకుంటాయని ఆశాభావం

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన అమెరికా

## హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు నోటీసులు




కేంద్ర హోంశాఖ ఆదేశాలతో పలు రాష్ట్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ ఆదేశాలతో పలు రాష్ట్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థానీయులను గుర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వీరు షార్ట్ టర్మ్ వీసాలతో ఉంటున్నట్లు గుర్తించారు. రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు గుర్తించారు.



2

## తెలంగాణలో ఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్

లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలి

'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై

## ఎన్నటికీ రాజీపడబోం

అంతా భారత్ ఇష్టమేనా?.. దేనికైనా రెడీ..

పాక్ ప్రధాని సంచలన వ్యాఖ్యలు

పాకిస్తాన్ ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో

భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాక్ ప్రధాని షెహబాబ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు అంటూ మిగతా.. 2లో

# వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు

అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

- వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో జగన్ వ్యాఖ్యలు
- గతంలో తనను 16 నెలలు జైల్లో ఉంచారని వెల్లడి
- ప్రజలే అండగా నిలిచారని స్పష్టీకరణ
- ఇప్పుడు కూడా ప్రజలే తీవ్రంగా స్పందిస్తారని ఆశాభావం



అమరావతి: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు. పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, “నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. మిగతా.. 2లో

# పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లదు..

- సింధు జలాల ఒప్పందం సస్పెండ్ చేసిన భారత్
- పాక్‌కు నీటి ప్రవాహం నిలిపివేతపై అమిత్ షా, జలశక్తి మంత్రి భేటీ
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలపై సమావేశంలో చర్చ
- “పాక్‌కు చుక్క నీరు వెళ్లదు” అని మంత్రి సి.ఆర్. పాటిల్ స్పష్టీకరణ
- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం, చర్చలకు విముఖతే కారణాలని భారత్ వెల్లడి



ఢిల్లీ: సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై చర్చించేందుకు మిగతా.. 2లో

## మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం



2లో

- హైదరాబాద్ వెళ్లినా.. ఢిల్లీ వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది
- ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. వారి సమస్యలను పరిష్కరిస్తాం
- 'మత్స్యకారుల సేవలో' పేరుతో మత్స్యకార భరోసా పథకానికి చంద్రబాబు శ్రీకారం
- 26 జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం శ్రీకాకుళం జిల్లాదే



2

## పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు.. కేంద్రమంత్రి బండి సంజయ్

- పహల్గామ్ ఘటన ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అన్న మంత్రి
- ఈ ఘటనకు ప్రతీకారంగా పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని వ్యాఖ్య
- ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అంతా అండగా ఉండాలని పిలుపు

# రాజకీయాల్లోకి కొత్త జనరేషన్ రావాలి

భారత్ సమ్మిట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత

ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయి

పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు




రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్: ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయని.. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమేనని.. ఆధునిక సోషల్ మీడియాతో అంతా మారిపోయిందంటూ చెప్పుకొచ్చారు. పాతతరం రాజకీయం ఓ రకంగా అంతరించిపోయిందని.. ప్రతిపక్షాలను అణచివేసే కార్యక్రమాలు జరుగుతున్నాయని రాహుల్ విమర్శలు గుప్పించారు. భారత్ జోడో యాత్రలో మిగతా.. 2లో



2లో

## ఆ విషయాల్లో మేం వారితో పోటీ పడలేకపోతున్నాం

- హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు
- భారత్ సమ్మిట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- ప్రతిపక్షాన్ని అణచివేసే దూకుడు రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపణ

అన్ని వర్గాల ఆకాంక్షలు

## నెరవేర్చడమే మా లక్ష్యం



దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం

ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశాం

రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది మావోయిస్టులు మృతి!

- ఐదో రోజు కూంబింగ్‌లో భాగంగా మావోయిస్టులకు భారీ షాక్
- బలగాలకు దిశానిర్దేశం చేస్తూ గగనతలంలో హెలికాప్టర్లు, డ్రోన్లు చక్కర్లు
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఆపరేషన్



ములుగు: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగుతోంది. ఐదో రోజు కూంబింగ్‌లో భాగంగా మావోయిస్టులకు భారీ షాక్ తగిలింది. భద్రతా బలగాల ఆపరేషన్‌లో మిగతా.. 2లో

భారాస 10 ఏళ్లలో సాధించలేదని..

## ఏడాదిన్నరలో సాధించాం

- కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసింది
- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉంది
- కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశాం
- ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవి



హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం కోసం మిగతా.. 2లో

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ఆదివారం - 27 - ఏప్రిల్ - 2025

# పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు..
## కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్: పహల్గామ్ ఘటనకు ప్రతీకారంగా దాయాది పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టేలా భారత్ చర్యలు ఉంటాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఎంసీహెచ్ఆర్డీలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వంద మందికి నియామక పత్రాలు అందజేశారు. ఆ తర్వాత మంత్రి మాట్లాడుతూ... పహల్గామ్ పాశవిక దాడి ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. కానీ, తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని అన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అందరూ అండగా నిలివాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

## మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

ఎచ్చెర్ల: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్డీయే ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 'మత్స్యకారుల సేవలో' పేరుతో మత్స్యకార భరోసా పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట విరామ సమయానికి సంబంధించి భృతి కింద ఒక్కో కుటుంబానికి ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. మొత్తం రూ.259 కోట్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. " హైదరాబాద్ వెళ్లినా.. దిల్లీ వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. ఆర్మీలో ఎక్కువ పని చేసేవారు ఇక్కడి వారే. 26 జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం శ్రీకాకుళం జిల్లాదే. ఈ జిల్లాలో తెలివితేటలు, నాయకత్వానికి కొదవలేదు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశాను. నేనూ బటన్ నొక్కవచ్చు.. కానీ, మీ కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి. ప్రజల ఆదాయం పెంచాలి. ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచాలి. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతాం. గత ప్రభుత్వ హయాంలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేశారు. వాటితో ఏం చేశారో లెక్కలు కూడా లేవు. గతంలో ఎర్రన్నాయుడు ఉద్దానం ప్రాంతానికి నీళ్లు సాధించారు. ఎంపీ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం పూర్తికాబోతోంది. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29శాతం ఏపీ నుంచే ఉంటుంది. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. మత్స్యకారుల పిల్లల్ని బాగా చదివించే బాధ్యత తీసుకుంటాం. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం. ఎచ్చర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. స్థానిక ఉద్యోగాలు ఈ ప్రాంత వాసులకే వచ్చేలా చర్యలు తీసుకుంటాం" అని చంద్రబాబు అన్నారు.

## తిరుమలలో రద్దీ..
## 26 కంపార్ట్ మెంట్లలో వేచి ఉన్న భక్తులు

తిరుపతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులకు తోడు వారాంతం కావడంతో తిరుమల కొండపై భక్తుల రద్దీ పెరిగింది. పిల్లాపాపలతో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూ లైన్లు నిండిపోయాయి. శనివారం ఉదయం నాటికి 26 కంపార్ట్ మెంట్లలో భక్తులు వేచి ఉన్నారని అధికారులు తెలిపారు. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు, రూ.300 ప్రత్యేక దర్శనానికి 5 గంటల సమయం పడుతోందని చెప్పారు. కాగా, శుక్రవారం 64,536 మంది భక్తులు వెంకన్నను దర్శించుకున్నారు. 30,612 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు టీటీడీ తెలిపింది. మొక్కుల రూపంలో భక్తులు రూ.3.37 కోట్లు హుండీలో స్వామి వారికి సమర్పించుకున్నారని వెల్లడించింది.

## తెలంగాణలో ఈ ప్రాంతాలకు వెళ్లండి..
## రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్

హైదరాబాద్: హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు. కలుషితాహారం కారణంగా మరణించిన గురుకుల విద్యార్థుల కుటుంబాలను, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కలవాలన్నారు. కూలిపోయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఫోర్త్ సిటీ, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన అశోక్ నగర్‌ను సందర్శించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన వినాశనం గురించి వినడానికి మీకు 'అద్భుతమైన' సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## భారత్-పాక్ ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు.. మధ్యవర్తిత్వానికి నిరాకరణ

ఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి లేదా మధ్యవర్తిత్వం వహించడానికి ఆయన నిరాకరించారు. ఇరు దేశాలు ఏదో ఒక విధంగా ఈ సమస్యను పరిష్కరించుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం రోమ్ పర్యటనకు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారా? ఇరు దేశాల నేతలతో మాట్లాడతారా? అని విలేకరులు ప్రశ్నించగా ఆయన స్పందించారు. "ఆ సరిహద్దులో ఉద్రిక్తతలు చాలా కాలంగా ఉన్నాయి. కానీ వారు దానిని ఏదో ఒక మార్గంలో పరిష్కరించుకుంటారు. ఇరు దేశాల నాయకులు నాకు తెలుసు" అని పేర్కొన్నారు. గతంలో తన మొదటి అధ్యక్ష పదవీకాలంలో భారత్-పాక్ మధ్య మధ్యవర్తిత్వం చేస్తానని ట్రంప్ ప్రతిపాదించారు. అయితే, భారత్ ఎప్పుడూ సరిహద్దు వివాదాల్లో బయటి మధ్యవర్తిత్వాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. పాకిస్థాన్ గతంలో మధ్యవర్తిత్వాన్ని కోరినప్పటికీ, ఈసారి కోరిందో లేదో స్పష్టత లేదు. గతంలో ట్రంప్ ప్రతిపాదనను భారత్ సున్నితంగానే తిరస్కరించింది. భారత్-చైనా సరిహద్దు వివాదంలోనూ ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రతిపాదనను భారత్ నిరాకరించింది. అయితే, ఈసారి మధ్యవర్తిత్వానికి ట్రంప్ ఆసక్తి చూపనప్పటికీ, పహల్గామ్ ఉగ్రదాడిని మాత్రం ఆయన, అమెరికా అధికారులు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దాడి జరిగిన కొద్ది గంటల్లోనే ట్రంప్ భారత ప్రధాని మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలిపారు, మద్దతు ప్రకటించారు. అమెరికా జాతీయ గూఢచార సంస్థ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ కూడా పహల్గామ్ దాడిని ఖండిస్తూ, బాధ్యులను పట్టుకోవడంలో భారత్‌కు మద్దతు తెలిపారు. "ఈ దారుణమైన దాడికి పాల్పడిన వారిని వేటాడటంలో మీకు మా మద్దతు ఉంటుంది" అని ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## 'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై
# ఎన్నటికీ రాజీపడబోం

మొదటి పేజి తరువాయి



భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు అంటూ కామెంట్స్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని, నదుల విషయంలో కూడా నీటిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాక్ ప్రధాని షరీఫ్ మాట్లాడుతూ..'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం. పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశం కరెక్ట్ కాదు. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు. చివరగా.. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ చెప్పుకొచ్చారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు.

## వాళ్లు ఎన్ని కేసులు పెడితే
## ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు

మొదటి పేజి తరువాయి

ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..

మొదటి పేజి తరువాయి



భద్రతా బలగాల ఆపరేషన్‌లో ఛత్తీస్‌గఢ్‌వైపు భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తోంది. వివరాల ప్రకారం.. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు దూసుకెళు తున్నాయి. ఐదో రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. బలగాలకు దిశానిర్దేశం చేస్తూ గగనతలంలో హెలికాప్టర్లు, డ్రోన్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో శనివారం దాడుల్లో భాగంగా 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. శుక్రవారం తుపాకులు, బాంబుల శబ్దాలు మారుమోగాయి. ఉదయం ఏడు గంటల నుంచే నాలుగు వైమానిక దళ హెలికాప్టర్లు చక్కర్లు కొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. గత రాత్రి 10 గంటల వరకు భారీ కాల్పులు, బాంబు పేలుళ్ల శబ్దాలు వినిపించాయని అన్నారు. దీంతో, సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. కూంబింగ్‌లో నిమగ్నమైన జవాన్లు ఎండల బారినపడుతున్నారు. నాలుగు రోజులుగా అడవుల్లోనే మకాం వేయడంతో ఇప్పటికే 15 మంది అస్వస్థతకు గురికాగా, శుక్రవారం మరో ఐదుగురిని హెలికాప్టర్‌లో వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ముగ్గురిని మెరుగైన చికిత్సకు భద్రాచలం తరలించారు. ఆపరేషన్ కర్రెగుట్టల గాలింపుతో అభయారణ్యం పరిసర గ్రామాల్లో జవాన్లు ఆంక్షలను విధించడం చర్చనీయాంశంగా మారింది. సమీప వ్యవసాయ క్షేత్రాలు, నీటి నిల్వ ప్రాంతాలకు వెళ్లినా హెచ్చరిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొనసాగుతున్న కర్రెగుట్ట ఆపరేషన్ ను వెంటనే ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మావోయిస్టులు లేఖ రాశారు. తక్షణమే ఆ ఆపరేషన్ ఆపి శాంతి చర్చలకు ముందుకు రావాలని మావోయిస్టులు విజ?ప్తి చేశారు. మావోయిస్టు బస్తర్ ఇంచార్జి రూపేష్ పేరిట ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. తెలంగాణ సరిహద్దుల్లో కొనసాగుతున్న సైనిక ఆపరేషన్ ను వెంటనే ఆపాలని ఆ లేఖలో విజప్తి చేశారు. గత కొంతకాలం నుంచి మావోయిస్టుల, కేంద్ర ప్రభుత్వం మధ్య శాంతి చర్చలు జరగాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి మావోయిస్టులో శాంతి చర్చలు జరపాలని ఏఐటీయూసీ కోరుతోంది. దీనిలో భాగంగా ఈనెల రెండో వారంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టులు శాంతి చర్చలు జరుపుకోవాలని భేషరతుగా ఎదురు కాల్పులు విరమించుకోవాలని సూచించారు. అయితే తాజాగా మావోయిస్టులు.. ఈ మేరకు లేఖ రాశారు. తమతో శాంతి చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు.

## భారాస 10 ఏళ్లలో సాధించలేదని..
# ఏడాదిన్నరలో సాధించాం

మొదటి పేజి తరువాయి

కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. "రూ.వేల కోట్లు అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా అత్యధిక పంట పండింది. యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. తాజాగా సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఏడాదిన్నరగా మేం చేసిన కృషి ఫలించింది. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు. దశాబ్దకాలంగా భారాస సాధించలేనిది.. మేం ఏడాదిన్నరలోనే సాధించాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరం. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేస్తాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# రాజకీయాల్లోకి కొత్త జనరేషన్ రావాలి

మొదటి పేజి తరువాయి



భారత్ జోడో యాత్రలో 4 వేల కిలోమీటర్లు నడిచానని.. నిన్ననే ఇక్కడకు రావాల్సిన ఉన్నా.. కశ్మీర్‌కు వెళ్లడంతో రాలేకపోయాయన్నారు. రాజకీయాల్లోకి కొత్త జనరేషన్ రావాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. భారత్ సమ్మిట్‌లో ప్రసంగించడం గర్వంగా భావిస్తున్నా.. తెలంగాణకు ఎంతో గొప్ప చరిత్రతో పాటు ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతులు, మహిళలు ఉద్యమానికి నాయకత్వం వహించారు. వారి పోరాటం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని రేవంత్ అన్నారు.

### అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం: రేవంత్ రెడ్డి



సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. " రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు" రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం- వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి.

# పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లదు..

మొదటి పేజి తరువాయి

ఈ విషయంపై చర్చించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పాకిస్థాన్‌కు నీటి ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేసే మార్గాలపై ప్రధానంగా చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా పోకుండా అన్ని చర్యలు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సమావేశం అనంతరం జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ మాట్లాడుతూ, "మోదీ ప్రభుత్వం తీసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు నిర్ణయం చారిత్రాత్మకమైనది, పూర్తిగా దేశ ప్రయోజనాలకు అనుగుణమైనది. సింధు నది నుంచి చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూస్తాం" అని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో, భారత్ బుధవారం 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి కొనసాగింపుగా, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ గురువారం పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తాజాకు అధికారికంగా లేఖ రాశారు. ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఆ లేఖలో స్పష్టం చేశారు. గతంలో 1960 నాటి సింధు జలాల ఒప్పందంలోని ఆర్టికల్ 12(3) ప్రకారం, మారుతున్న పరిస్థితుల (భారీగా పెరిగిన జనాభా, స్వచ్ఛ ఇంధన ఆవశ్యకత, నీటి పంపకాలకు ఆధారమైన ప్రాథమిక అంచనాలలో మార్పులు) దృష్ట్యా ఒప్పందంపై పునఃసమీక్ష జరపాలని



కోరుతూ భారత్ పలుమార్లు నోటీసులు ఇచ్చిందని లేఖలో గుర్తుచేశారు. పాకిస్థాన్ పదేపదే ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని భారత్ ఆరోపించింది. ముఖ్యంగా, జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రోత్సహిస్తోందని, దీనివల్ల ఏర్పడిన భద్రతాపరమైన అనిశ్చితి కారణంగా ఒప్పందం ప్రకారం తమ హక్కులను పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామని భారత్ పేర్కొంది. చర్చల కోసం భారత్ చేసిన విజ్ఞప్తులకు పాకిస్థాన్ స్పందించకపోవడం కూడా ఒప్పంద ఉల్లంఘనే అని స్పష్టం చేసింది. లోతైన పరిశీలన తర్వాతే ఒప్పందాన్ని రద్దు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖర్జీ తన లేఖలో వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రణాళికల్లో భాగంగా, సింధు, జీలం, చీనాబ్ నదులపై ఉన్న డ్యామ్‌లలో పూడిక తీసి, రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది. జీలం ఉపనదిపై నిర్మిస్తున్న కిషన్‌గంగ, చీనాబ్ ఉపనదిపై నిర్మాణంలో ఉన్న రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ అభ్యంతరాలను ఇకపై భారత్ పట్టించుకోకపోవచ్చు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఈ నదులపై కొత్త డ్యామ్‌లు, మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా పరిశీలనలో ఉంది. ఈ నిర్ణయంపై ప్రపంచ బ్యాంకు లేదా ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి ఒత్తిడి వస్తే ఎదుర్కొనేందుకు న్యాయపరమైన వ్యూహాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత్ ఈ చర్య ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ఇతర దేశాలకు వివరించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. మరోవైపు, ఒప్పందం రద్దుపై పాకిస్థాన్ తీవ్రంగా స్పందించింది. "సింధు జలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నమైనా యుద్ధ చర్యగా పరిగణిస్తాం, పూర్తిస్థాయి జాతీయ శక్తితో ప్రతిస్పందిస్తాం" అని పాకిస్థాన్ ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్‌లపై భారత్‌కు పూర్తి హక్కులు లభించగా, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ జలాలను వాడుకునే హక్కు పాకిస్థాన్‌కు దక్కింది.

## ఆ విషయాల్లో మేం వారితో
# పోటీ పడలేకపోతున్నాం



హైదరాబాద్: రాజకీయాల్లో తమ ప్రత్యర్థులు కోపం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారని, ఆ విషయాల్లో వారితో తమ పార్టీ పోటీ పడలేకపోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తాను నిన్ననే రావాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని, అందుకు క్షమించాలని కోరారు. దేశంలో ప్రస్తుతం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా, అణచివేసే దూకుడు రాజకీయాలు కొనసాగుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కొన్నేళ్ల క్రితం తమ పార్టీ పూర్తిగా ఒంటరిగా, రాజకీయంగా చిక్కుకుపోయినట్లు భావించామని ఆయన వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయని, మీడియా సహా ఏదీ తమకు అనుకూలంగా లేదని అన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే తమ పార్టీ చరిత్రను గుర్తుచేసుకుని, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర (భారత్ జోడో యాత్ర) చేయాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ గాంధీ వివరించారు. తాను కశ్మీర్‌లో యాత్రను ముగించినట్లు గుర్తుచేశారు. ఈ పాదయాత్ర ద్వారా తాను ముఖ్యంగా రెండు విషయాలు నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు. "ప్రపంచవ్యాప్తంగా మా ప్రత్యర్థులు కోపం, భయం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారు. ఆ విషయంలో వారితో పోటీ పడటం మా వల్ల కాదు. కోపం, భయం, ద్వేషం విషయంలో వారు ప్రతిసారీ మమ్మల్ని అధిగమిస్తారు, ఓడిస్తారు" అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ నేపథ్యంలో తాము ఎక్కడ, ఎలా పని చేయాలనే అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. తమను తాము నిర్మించుకునే అవకాశం ఎక్కడ ఉందో ఆలోచించామని అన్నారు.

## జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై
# నెగ్గిన అవిశ్వాసం



విశాఖ : విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయవంతమైంది. ఈ పరిణామంతో కూటమి సభ్యులు సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడామని వారు వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం కూటమి కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నగరంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కనీసం వీధి దీపాలు వెలిగించలేని, తాగునీటి సమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. తమ అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని, ఇది విశాఖ ప్రజల విజయమని అన్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా తమకు న్యాయం జరగలేదనే భావనతో, అభివృద్ధి కాంక్షించి అవిశ్వాసానికి మద్దతు పలికారన్నారు. గత పాలనలో జరిగిన అవినీతికి, అభివృద్ధి రాహిత్యానికి ఈ అవిశ్వాస విజయంతో ముగింపు పలికామని కూటమి కార్పొరేటర్లు పేర్కొన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కూటమి కైవసం చేసుకుంటుందని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని వారు తెలిపారు. ఈ విజయంతో విశాఖపట్నం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపితమైందని పలువురు కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు.

## పేరుకు భారత్ సమ్మిట్..
## ఒక్క భరతుడు రాలేదు
## రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్‌పై
## కేఏ పాల్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'పై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'పేరుకు భారత్ సమ్మిట్, కానీ ఒక్క భరతుడు రాలేదు' అంటూ సదస్సు నిర్వహణ తీరుపై ఆయన పలు ఆరోపణలు చేశారు. ఈ సమ్మిట్ కోసం ప్రభుత్వం వంద కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. దాదాపు 200 దేశాల నుంచి అధ్యక్షులు, ప్రధానమంత్రులను ఈ సదస్సుకు ఆహ్వానించారని, అయితే వారిలో ఒక్కరు కూడా హాజరు కాలేదని ఆయన విమర్శించారు. అంతేకాకుండా, ప్రపంచ ప్రఖ్యాత సెలబ్రిటీలు గానీ, వేల సంఖ్యలో ఉన్న బిలియనీర్లు గానీ ఎవరూ ఈ సదస్సు వైపు కన్నెత్తి చూడలేదని పాల్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి 'భారత్ సమ్మిట్' అని పేరు పెట్టడంపైనా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పేరులో 'భారత్' ఉన్నా, ఒక్క 'భరతుడు' కూడా సదస్సుకు రాలేదని ఎద్దేవా చేశారు. ఇది 'భారత్ సమ్మిట్' కాదని, కేవలం 'కాంగ్రెస్ సమ్మిట్' అని విమర్శించారు. ఇలాంటి సమ్మిట్లతో తెలంగాణ రాష్ట్రాన్ని, దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను 'గ్లోబల్ పీస్ సమ్మిట్' నిర్వహిస్తానని ప్రతిపాదించగా, దానికి రేవంత్ రెడ్డి కూడా అంగీకారం తెలిపారని గుర్తుచేశారు. అందరినీ ఆహ్వానిద్దామని చెప్పిన రేవంత్, ఇప్పుడు ఎవరినీ తీసుకురాలేకపోయారని అన్నారు. తన ఆలోచనను కాపీ కొట్టి, 'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు' రేవంత్ రెడ్డి వ్యవహరించారని పాల్ మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న సదస్సుకు కొలంబియా దేశానికి చెందిన ఒక మాజీ మంత్రి మాత్రమే వచ్చారని ఆయన తెలిపారు. రాష్ట్రానికి శాంతి కావాలన్నా, పెట్టుబడులు రావాలన్నా 'పాల్ అన్న' రావాలని, తద్వారా పాలన మారాలని వ్యాఖ్యానించారు.

## శాంతిభద్రతలను పరిరక్షించటమే

### మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం..... -పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26. పెద్దపల్లి అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం గోదావరిఖని లోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని 1 టౌన్, రామగుండంసర్కిల్ సివిల్ పోలీసులకు



"మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్" నిర్వహించారు.ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది తో మాట్లాడారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ....ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ద్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి డీసీపీ వివరించారు.మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది..? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు..? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు.మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టిస్ చేపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఏన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్యా రాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎంపీ

## గడ్డం వంశీకృష్ణ చొరవతో చిగురించిన ఆశలు....

### సంతోషం వ్యక్తం చేస్తున్న పెద్దపెల్లి జిల్లా ప్రజలు...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26. రామగుండంలో ఎయిర్ పోర్ట్ నిర్మించాలని స్థల సేకరణ పై రి సర్వే చేయాలని గత పది రోజుల క్రితం కేంద్ర పౌర విమానయానా శాఖ మంత్రి కి పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ వినతి అందించారు.వెంటనే స్పందించిన ఎయిర్ ఫోర్స్ అథారిటీ నిన్న ఎయిర్పోర్ట్ భూములను పరిశీలించారు.పెద్దపల్లి జిల్లాలో ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే యోచనలో ఎయిర్ ఫోర్స్ అథారిటీ ఉందని, రీ సర్వే ఆశలతో రెండు దశాబ్దాల కల నెరవేరబోతుందని ఆశభావం వ్యక్తం చేశారు.ఫలించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాటం...అంతర్గాం మండల కేంద్రంలోని టెక్స్టైల్ భూములను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అథారిటీ ఉన్నతాధికారులు ఎయిర్పోర్ట్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారు.గతంలో సమర్పించిన భూ రికార్డుల ఆధారంగా ఆ స్థలాన్ని పరిశీలించి,సమీపంలోని రైల్వే ట్రాక్ రాజీవ్ రోడ్డు కనెక్టివిటీ ఇరువైపులా పట్టణాలు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. అక్కడి నుండి బసంత్ నగర్ ఎయిర్పోర్ట్ భూములు పరిశీలించి,ఎయిర్పోర్ట్ నిర్మాణం ఎంతో అవసరం కాగా అంతర్గాం, బసంత్ నగర్ కేంద్రాల్లో దానిని ఎక్కడ నిర్మిస్తారనే ల్యాండ్ మార్క్ వంటి అంశాలు పరిశీలిస్తున్నారు. ప్రతి సమస్యపై స్పందిస్తూ, ప్రజల అవసరాల దృష్ట్యా పెండింగ్ లో ఉన్న సమస్యలను కేంద్ర మంత్రులకు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ ఎం పి ఎటువంటి సమస్యలపై స్పందించలేదని అనతి కాలంలోనే పలు సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడుతూ ముందు ఉంటున్నాడని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## హెచ్ఐసీసీ-నోవాటెల్లో జరిగిన

## భారత్సమ్మిట్-2025 లో తెలంగాణ

### రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26.హైద్రరాబాద్ లో భారత్సమ్మిట్ పాల్గొన్న జనక్ ప్రసాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సమావేశంలో పాల్గొనడం గర్వకారణమని, "కొత్త బహుళపాక్షికతను ఆవిష్కరించడం" అనే అంశంపై నిర్వహించిన శక్తివంతమైన ప్యానల్ చర్చలో భాగస్వామిగా ఉండటం సంతోషం కలిగించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని 100కి పైగా దేశాల నుండి ప్రతినిధులు హాజరై, మారుతున్న ప్రపంచ వ్యవస్థలో గ్లోబల్ గవర్నెన్స్ పాత్రపై సమగ్ర చర్చలు నిర్వహించారని వివరించారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఇతర మంత్రులతో కలిసి ప్రపంచ రాజకీయ మార్పులపై, భారతదేశం చేపడుతున్న నాయకత్వ పాత్రపై అభిప్రాయాలు పంచుకున్నట్లు చెప్పారు.భారత్సమ్మిట్2025 ప్రపంచ మాందలిక వేదికపై భారతదేశం తన గొప్ప సామర్థ్యాన్ని, సహకార దృక్పథాన్ని ప్రదర్శించేందుకు ఒక కీలకమైన మైలురాయిగా నిలిచిందని, అలాగే ప్రపంచ అభివృద్ధిలో భారతదేశం పాత్రను కొత్త దశలకు తీసుకెళ్లేందుకు ఈ సమ్మిట్ ఉపయుక్త వేదికగా నిలిచిందని నమ్మకం వ్యక్తం చేశారు.

## మఖ్తల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ

## అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి



అమరచింత /మక్తల్/ వనపర్తి ప్రతినిధి/ ఏప్రిల్ 26/ ( జనం రిపోర్టర్ ) : మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలో సర్వేనెంబర్ 05 పంచనామ చేయాలని ఆర్ ఐ కి దరఖాస్తు పెట్టి 15 నెలలు దాటినా పట్టించుకోవడంలేదని ఇంతవరకు కార్యాలయం చుట్టూ తిప్పుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు వాకిటి ఆంజనేయులు ముదిరాజు ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ తహసిల్దార్ ఆర్ ఐ లపైజిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని బిఎస్పి వాకిటి అంజనేయులు ముదిరాజ్ అన్నారు.మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలో సర్వేనెంబర్ 05 లో గత ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం భూములలో ఇండ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఒకే ఒక వ్యక్తి రాజకీయ నాయకుడు ఆ భూమిని కబ్జా చేశారు. గతంలో సర్వేయర్ బాలరాజు ఆ భూమి సర్వే చేయడానికి డబ్బులు అడగడం జరిగినది. అవినీతి కేసులో అరెస్టయ్యారు. ఆనాడు ఉన్న గిరిదవార్ విజయ్ కుమార్ బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత కొత్తగా వచ్చిన గిరిదవార్ ఒక రాజకీయ నాయకుని అండతో ఆ భూమి ఇప్పటివరకు పంచనామా చేయలేదు. ఆ రాజకీయ నాయకుడికి అండదండలతో అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్న వారిపై తక్షణమే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని బిఎస్పీ వాకిటి అంజనేయులు ముదిరాజ్ జ్యోతి రావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు డిమాండ్ చేశారు. త్వరలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తాము అని అన్నారు.

## సర్జరీ విజయవంతం చేసిన వైద్య బృందానికి

## అభినందనలు.... - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం: ఏప్రిల్ 26.పెద్దపల్లి// క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఒక మహిళకు ఆరు నెలల క్రితం సీజరియన్ జరిగిందని, అప్పటి నుండి ఆమె అప్పేండిక్స్ తో బాధ పడుతుందని, నిన్న



ప్రైవేట్ ఆసుపత్రిలో ఫిజిషియన్ ను సంప్రదించగా ఇది అప్పేండిక్స్ అని చెప్పడము జరిగింది.ఈ క్రిటికల్ కండిషన్ లో ఆ మహిళ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఏప్రిల్ 25న. రావడం జరిగిందని, వెంటనే మహిళను చూసి అడ్మిట్ చేసుకొని , ఏప్రిల్ 26న డా. సాయి ప్రసాద్, జనరల్ సర్జన్, డా.అమరసింహ రెడ్డి లాప్రోస్కోప్ సర్జన్ డా. కె.శ్రీధర్,సూపరింటెండెంట్, డా.స్వాతి, డా.భవాని కలిసి, ఆ మహిళకు లాప్రోస్కోప్ సర్జరీ విజయవంతంగా చేశారని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నిరుపేదలకు అండగా, "సమతా ఫౌండేషన్"...

### అనారోగ్య బాధితునికి 11 వేల రూపాయలు ఆర్థిక సహాయం....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఎన్టిపిసి// ఏప్రిల్ 26. నిరుపేదల కు "సమత ఫౌండేషన్" అండగా నిలుస్తోంది. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూ పోరట్పల్లికి చెందిన ఆత్రం ఆంజనేయులు (28) గత రెండు నెలలుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో హాస్పటల్ తీసుకెళ్లేందుకు డబ్బులు లేక ఇంటి వద్దనే ఉన్నారు. భార్య నిండు గర్భిణి అనారోగ్యంతో బాధపడుతూ భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు దాతలు సహాయం కోరింది. సోయం జనార్ధన్ ద్వారా విషయం తెలుసుకున్న సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు "సమతా ఫౌండేషన్" నిర్వాహకులు మార్షల్ దుర్గం ప్రమీల- నగేష్ లు తమ ఎన్టిపిసి కమిటీ సభ్యులతో కలిసి ఆంజనేయులు ను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆంజనేయులు అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని "సమతా ఫౌండేషన్" ద్వారా అండగా ఉంటామని భరోసా నింపుతూ దాతల సహకారంతో సేకరించిన 11 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అడగ్గానే మానవత్వంతో స్పందించి సహాయం అందించిన ప్రతి దాతకి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. ఇంకా మానవతావాదులు ముందుకు వచ్చి ఆంజనేయులు ఆరోగ్య ఖర్చులకు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా ఫౌండేషన్ సభ్యులు దుర్గం నరసయ్య, ముడిమడుగుల సురేష్, చందనగిరి శివప్రసాద్, జిమ్మిడి శాంతి కుమార్, బాధితుడి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మేడే పోరాట స్ఫూర్తితో

## నాలుగు లేబర్ కోడుల రద్దుకై పోరాడుదాం....!

### -ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు చిలుక శంకర్....




రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26. ఎన్టీపీసీ ఐఎఫ్టియు కార్యాలయంలో 139వ. మేడే వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా కామ్రేడ్ చిలుక శంకర్ ఐఎఫ్టీయు జిల్లా ఉపాధ్యక్షులు హాజరై మాట్లాడుతూ.. కార్మికవర్గం పనిగంటలు తగ్గింపు డిమాండ్




మార్క్స్ జీవిత కాలంలో మొదట యూరోప్ కార్మికవర్గం 1886.చికాగో కేంద్రంగా పెట్టుబడిదారీ వర్గం మీద పనిగంటలు తగ్గింపు కై శ్రామిక వర్గం తిరుగుబాటు బావుటా...! ఎగురవేసిందన్నారు.ఆరుగురు కార్మికుల అమరత్వం, ఏడుగురికి ఉరిశిక్ష, నలుగురికి ఉరితీతలతో చరిత్రకెక్కిందన్నారు.1889 లో ఎంగెల్స్ చోరవతో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ "మే" ఒకటి అంతర్జాతీయ శ్రామిక దీక్షా దినంగా ప్రకటించిందన్నరు.నాటి నుండి నేటి వరకు కార్మికవర్గం పోరాట దినంగా పాటిస్తున్నారని మేడే ని సృష్టించిన నాటి వీర చికాగో కార్మికవర్గానికి జేజేలు, అమరవీరులకు విప్లవ జోహార్లు మేడే విప్లవ స్ఫూర్తితో ప్రపంచ కార్మికవర్గం, భారత కార్మికవర్గం హక్కులు, సౌకర్యాలు, వేతనాలపై పోరాటాలు చేసిందని వారి పోరాట ఫలితమే నేడు కార్మికవర్గం అనుభవించే ఈపాటి కార్మిక చట్టాలున్నాయన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలపై రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పోరాటాలకు సిద్ధం కావాలని 139వ. మేడే ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి గత కార్మిక చట్టాల్ని కొనసాగించాలని ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, తదితర డిమాండ్ల కోసం139వ. మేడే ప్రత్యేకంగా ఐఎఫ్టియు జాతీయ కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్మికులు కనక లక్ష్మి, రజిత, లక్ష్మి, రాజేశ్వరి, జి శంకరమ్మ, భీమమ్మ, జి పద్మ, కె.దేవమ్మ, కె పద్మ, వరలక్ష్మి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలి....

### విద్యుత్ పోల్ తరలింపు పనులకు చెల్లింపులు పూర్తి చేయాలి....

### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన డబ్బులు రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులను కలెక్టర్ మంజూరు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా




ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు కోసం మున్సిపాలిటీ వెంటనే నిధులను విద్యుత్ శాఖకు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు.పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆస్తిపన్ను వసూలు పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలో భవన నిర్మాణ పనులపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో భవన నిర్మాణాలు జరగడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనాల శాఖ భావ్ సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నిహాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పింగిలి వెంకట్ రాం నరసింహారెడ్డికి

## డిసిసి పదవిని ఇవ్వాలి కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట దేవస్థానం నందు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలో విద్యార్థి నాయకుడి నుంచి నిత్యం పార్టీ కోసం కష్టపడుతూ తనదైన ముద్ర వేసుకున్న అటువంటి వెంకట్ రెడ్డికి జిల్లా ప్రజలు ముక్తకంఠంతో డిసిసి పదవి ఇవ్వాలని కోరుకుంటూ ఈరోజు హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నటువంటి పింగిలి.వెంకట్రాం నరసింహారెడ్డికి హనుమకొండ డీసీసీ పదవి ఇవ్వాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది హసన్ పర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు చేస్తూ జిల్లా ప్రజలను.నాయకులను. కార్యకర్తలను.ఆదుకుంటూ మంచి మనసున్న నేతగా పేరుపొందుతూ ప్రతి యొక్క నాయకుడికి అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డికి జిల్లా ప్రజలు. అసెంబ్లీ మండల ప్రజలు డీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు. ప్రజలు కోరడం జరుగుతుందిఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల లక్ష్మారెడ్డి,దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి,జన్ను.పుల్ల రవి.మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు జోరిక పూల, ఉపాధ్యక్షులు బత్తుల స్వాతి,మాజీ సర్పంచులు'ఉప సర్పంచ్. భగత్ రాజు.సురేందర్.సునీల్ వీసం సురేందర్ రెడ్డి,బల్సుకురి. శ్రీనివాస్, దేవస్థాన డైరెక్టర్. రాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు రమేష్, రామంచ ప్రభాకర్,మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సౌరం.చరణ్ తేజ, బైరన్ పల్లె యూత్ అధ్యక్షులు రామకృష్ణ, యూత్ నాయకులు బిక్షపతి, విష్ణు,తదితరులు పాల్గొన్నారు

## చిన్నపిల్లలు బరువు తగ్గకుండా

## అంగన్వాడీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి




నిజాంపట్నం,, ( జనం రిపోర్టర్ ) : చిన్నపిల్లలు బరువు తగ్గకుండా అంగన్వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని ఆ పిల్లల తల్లిదండ్రులకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారిని డి రాధా మాధవి తెలిపారు శనివారం ఐ. సి .డి .ఎస్. ప్రాజెక్టు పల్లపట్ల కార్యాలయము నందు జిల్లా అధికారిని శ్రీమతి డి .రాధా మాధవి అంగన్ వాడి కార్యకర్తలకు ప్రాజెక్ట్ సమావేశము నిర్వహించిరి. ఈ సమా ఎద్వేశంలో కార్యకర్తలకు ఈ క్రింది విషయములు సూచించిరి. సమయపాలన పాటించవలెను. లబ్ధిదారులకు సక్రమముగా, సకాలంలో స్టాకు పంపిణీ చేయవలెను .ప్రీ స్కూల్ సక్రమముగా నిర్వహించవలెనని ,బరువు తక్కువ పిల్లలు పట్ల తగు శ్రద్ధ తీసుకోవలెనని, వేసవి దృష్ట్యా ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు పెట్టాలని సూచించినారు. తదుపరి కార్యాలయం సూపర్వైజర్లకు రివ్యూ మీటింగ్ నిర్వహించి, తగు సలహాలు సూచనలు ఇచ్చినారు. ఈ కార్యక్రమములో ప్రాజెక్టు అధికారిని ఎం. అనసూయ సూపర్వైజర్లు బి.పి.సి. అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొనినారు.



## రాగల 3 రోజులలో అధిక

### ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం.....-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....




రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం: ఏప్రిల్ 26.పెద్దపల్లి/రాగల 3 రోజులలో అధిక ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన జిల్లాలో రాగల మూడు రోజుల వరకు (ఏప్రిల్ 27 నుంచి ఏప్రిల్ 30) వాతావరణ విశ్లేషణ వాతావరణ శాఖ అందించిందని, ఏప్రిల్ 27న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల వరకు నమోదయ్య అవకాశం ఉందని తెలిపారు. ఏప్రిల్ 27న. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఏప్రిల్ 28 నుంచి ఏప్రిల్ 30 వరకు పెద్దపల్లి జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుండి మూడు డిగ్రీలు అధికంగా ఉండే అవకాశం ఉందని, వాతావరణ శాఖ అంచనా ప్రకారం 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నవోదయ అవకాశాలు ఉన్నాయని, అదే సమయంలో వడ గాల్పులు వీచే అవకాశం , రాత్రిపూట వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని , ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తక్షణమే

### జనగణన తో పాటు కుల గణన చేయాలి తాటిపాముల వెంకట రాములు




హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : కేంద్ర ప్రభుత్వం తక్షణమే జన గణన తో పాటు కుల గణన కూడా చేయాలని కుల జనాభా ఆధారంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీ అభివృద్ధికి తోడ్పడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు పిలుపునిచ్చారు శనివారం రోజున హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం బీసీ హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగినది సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట రాములు మాట్లాడుతూ చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని డిమాండ్ చేసినారు అనంతరం సాయిని నరేందర్ ఓబీసీ ఆల్ ఇండియా జాక్ చైర్మన్ మాట్లాడుతూ బీసీలకు విద్యా ఉద్యోగాలలో స్థానిక సంస్థలలో కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్నట్టు తక్షణమే 42% రిజర్వేషన్లు కల్పించాలని పాలకుల డిమాండ్ చేసినారు ఎస్సీ ఎస్టీ బీసీలు ఐక్య పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు బానిస దోపిడీ స్వభావ భావజాలాన్ని నిరోధించుటకు భౌతిక భావజాలాన్ని విస్తృత ప్రాచుర్యంలోకి తేవాలన్నారు రాజ్యాధికారమే సకల సమస్యలకు పరిష్కారం అని అందుకు ఇండియా కూటమిలాంటివి మరింత బలపడాలని పేర్కొన్నారు బట్టి శ్యామ్ యాదవ్ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జనాభాలో 90 శాతం గా ఉన్న బీసీ సమాజం పది శాతం గా ఉన్న ఎక్కువ కులం చే పాలించబడడం విచారకరమన్నారు దేశంలో వేయబడిన అన్ని బీసీ కమిషన్లు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించినప్పటికీ పాలకులు పాటించడం లేదని ధ్వజమెత్తినారు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ భారత్ బచావో నాయకులు మాట్లాడుతూ బీసీలు అంటే బెస్ట్ క్లాస్ నైపుణ్యత కలిగిన బీసీలను పాలకులు కావాలని ఆర్థికంగా సాంఘికంగా వెనకకు నెట్టివేసి వెనుకబడిన తరగతులను ఎద్దేవ చేస్తున్నారని మండిపడినారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ చార్వాక మాట్లాడుతూ కులము లేని మతము లేని సమాజం కొరకు విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించుకోవడం ద్వారా బీసీ సమాజం చైతన్యవంతమైతే విప్లవం అనివార్యమని పేర్కొన్నారు నేదునూరి రాజమౌళి బీసీ హక్కుల సాధన సమితి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగనన చేసి బీసీ బిల్లు పెట్టాలి పార్లమెంటులో పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి కోర్టు అడ్డంకులను నిరోధించాలని తెలిపారు జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు పార్లమెంటు అసెంబ్లీ రాజ్యసభ విధాన సభలలో జనాభా ఆధారంగా కేటాయింపులు ఉండాలని డిమాండ్ చేశారు తమిళనాడు మాదిరిగా బీసీ రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరినారు దేశవ్యాప్తంగా నేటికీ బీసీ కులాలు వెనుకబడి ఉండడానికి పాలకవర్గాలు అవలంబించే బీసీ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమన్నారు మహిళా లకు 33% రిజర్వేషన్లు ఆమోదించి అటుకెక్కించారని ఆవేదన వెలిబుచ్చారు ఈ సమావేశంలో బైరి తిరుపతి మడ్డి రాజారాం బి రమేష్ టి ప్రశాంత్ పి రామ్ గోపాల్ చారి జి రాజేందర్ పాలబిందల సాత్విక్ వెంకటేష్ పులి తదితరులు పాల్గొన్నారు

## నూతన రెస్టారెంట్ ను ప్రారంభించిన మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి గారు మరియు చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ భీమ్ భరత్ గారు






రంగారెడ్డి జిల్లా ప్రతినిధి శంకర్ పల్లి ( జనం రిపోర్టర్ ) : శంకర్పల్లి మండలం మోకిల గ్రామ చౌరస్తా వద్ద చెవుల అరుణ్ కుమార్, మహేందర్ గారు (గొల్లగూడ ) నూతనంగా ఏర్పాటు చేసిన మసాలా వైభవం మల్టి కుసైన్ రెస్టారెంట్ కి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన మాజీ చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ గడ్డం రంజిత్ రెడ్డి గారు మరియు వీరితో పాటుగా చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ గారు ప్రారంభించారు .....ఈ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ పల్లీ మండలం అధ్యక్షులు జనార్దన్ రెడ్డి గారు, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య గారు, నవాబ్ పేట మండలం అధ్యక్షులు వెంకటయ్య గారు , చేవెళ్ళ మాజీ సర్పంచ్ ఆగిరెడ్డీ గారు , పి ఎ సి ఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి గారు , మధుసూదన్ గుప్తా గారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ప్రశాంత్ , అస్తర్ , ఇంద్ర రెడ్డి , శరత్ రెడ్డి , శ్రీకాంత్ , ఎంపీటీసీ గణేష్ , కేబుల్ రాజు, శ్రీధర్ , మరియు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు......

## వడదెబ్బ - తీసుకోవలసిన జాగ్రత్తలు




నార్పల ( జనం రిపోర్టర్ ) : మండల పరిధిలో గల బి. పప్పూరు గ్రామములో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వడదెబ్బ – తీసుకోవలసిన జాగ్రత్తలు పై స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది ఉపాధి హామీ పథకంలో పనిచేయుచున్న గ్రామీణ వికాస శ్రామికులు పని చేయు ప్రదేశానికి వెళ్లి వడదెబ్బ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.వడదెబ్బ లక్షణాలు:తీవ్రమైన తలనొప్పి,కళ్ళు తిరగడం, తల తిరగడం, నీరసంగా ఉండటం,వాంతులు కావడం,విరేచనాలు కావడం,అధిక దాహం వేయడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వడదెబ్బ రాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలుప్రతి ఒక్కరూ తప్పనిసరి ఎండకు వెళ్ళినట్లయితే తల మీద చేతులు వేసుకోవడం,తల మీద తడి బట్టను కలిగి ఉండడం,ఎక్కువ నీరు త్రాగడం,ద్రవాహారం తీసుకోవడం గొడుగు వాడడం మొదలగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీరాములు, ఏఎన్ఎం అంజలి, ఆశా కార్యకర్తలు రామసుబ్బమ్మ, మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ నరసన్న, ఉపాధి హామీ గ్రామీణ వికాస శ్రామికులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సేవలో... ప్రభుత్వం

## వేట నిషేధ భృతి రూ. 20 వేలు పంపిణీ

## గంగపుత్రుల గ్రామాల్లో పండగ వాతావరణం

## అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

## రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



రేపల్లె, ( జనం రిపోర్టర్ ) : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం, కొత్తపాలెం గ్రామపంచాయతీ గొందు సముద్రం జట్టి వద్ద శనివారం ఏర్పాటు చేసిన మత్స్యకార సేవ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ కుటుంబ పోషణకు తమ ప్రాణాలను పణంగా పెట్టి జీవన పోరాటం చేస్తున్న గంగపుత్రుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వేట నిషేధ భృతిని రూ. 10,000 నుండి రూ. 20 వేలకు పెంచినట్లు తెలిపారు. పేదలకు అండగా ఉండాలనే ఆశయంతో సీఎం చంద్రబాబు నాయుడు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని చెప్పారు. పించన్ల పెంపు నుంచి అన్నక్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం వరకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. మత్స్యకారుల సేవలో పేరుతో సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు









ఇబ్బందులు పడకూడదని ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రాష్ట్రంలో 12 తీర ప్రాంత జిల్లాల్లో సముద్రం వేటపై జీవిస్తున్న 1,29,178 కుటుంబాలకు ఆర్థికంగా రూ.258 కోట్ల లబ్ధి చేకూరనుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు, ఆక్వా రంగానికి ఎప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మృతిని తొలిసారిగా ప్రవేశపెట్టింది తెలుగుదేశం పార్టీ అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం వలలు, పడవలు. ఐస్ బాక్సులు, సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేసిన ఘనత టిడిపిదే అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేకంగా శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదే అన్నారు. రాష్ట్రంలో రూ.1,961 కోట్లతో కొత్తగా 9 ఫిషింగ్ హార్బర్లను రెండు దశల్లో నిర్మిస్తోంది రూ.199 కోట్లతో 7 ఫిష్ . అలాగే వీటికి అదనంగా ల్యాండింగ్ సెంటర్లు కూడా సిద్ధం చేస్తోందని చెప్పారు. 2014..19లో నిజాంపట్నం మండలం నక్షత్ర నగర్, లంకేవానిదిబ్బ గ్రామాలలో జట్టిల నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసిందని చెప్పారు. ప్రస్తుతం గొందు సముద్ర జట్టిని అభివృద్ధి చేసేందుకు రెండు కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. రూ.88 కోట్లతో నిజాంపట్నం ఆక్వా పార్క్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆఖ్వరంగం అభివృద్ధితోపాటు మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల చేతనందిస్తుందని చెప్పారు. మత్స్యకారులు చేపల వేటసమయంలో మరణిస్తే ప్రభుత్వ రూ.10 లక్షలు భీమ చెల్లిస్తోందని, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్ పై రూ.9 సబ్సిడీ, ఇస్తుందన్నారు. మెకనైజ్డ్ బోట్లకు నెలకు 3,000 లీటర్లు, మోటరైజ్డ్ బోట్లకు నెలకు 300 లీటర్ల వరకు డీజిల్ పై సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జే.వెంకట మురళి మాట్లాడుతూ మత్స్యకార సేవ కార్యక్రమం పండుగ వాతావరణం జరగటం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా 103 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉందన్నారు. వేట నిషేధభృతి జిల్లాలో 13 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలో చీరాల బాపట్లలోనే కాకుండా రేపల్లె నియోజకవర్గం లో కూడా టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. అనంతరం జిల్లాలోని 12,671 మంది మత్స్యకారులకు రూ 25, 34, 20,000 రూపాయలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస నాయక్ కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాన్ని మురళీధరరావు, మంత్రి సోదరులు శివప్రసాద్, డిపిఓ ప్రభాకర్, అగ్నికుల క్షత్రియ సంక్షేమ చైర్మన్ బొమ్మిటి రామకృష్ణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పని గంటల పెంపుదలను కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తిప్పికొట్టండి.

### టి యు సి ఐ మేడే వేడుకల గోడపత్రిక విడుదల




అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) 139వ మేడే పోస్టర్లను వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో శనివారం .జిల్లా కోశాధికారి సి రాజు, పార్టీ మండల కార్యదర్శి కె రాజన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదన్నారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు. మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను నిలుపుదల చేయాలని, పనిగంటల పెంపుదలను వ్యతిరేకిస్తూ జిల్లాలో 139వ మేడే జరుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా నాయకులు సామెలు, భక్తరాజు, కురుమన్న, పార్టీ నాయకులు ఏసన్న, ఆనంద్, జిలాని, జగదీష్, తాజ్ , బాలస్వామి తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ కార్మిక సంఘం

### విస్తృతస్థాయి సమావేశానికి బయలుదేరిన నాయకులు




అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : నారాయణ పేట జిల్లా మరికల్ లో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర విశ్శృత స్థాయి సమావేశాలకు శనివారం ఆత్మకూర్ అమరచింత మండలాల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్మికులు పెద్ద ఎత్తున మరికల్ కు తరలి వెళ్లారు. సందర్భంగా జరుగుతున్న ర్యాలీ బహిరంగ సభకు అమరచింత నుండి తరలినసంఘం నాయకులు తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ మండల అధ్యక్షులు శంకర్ సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు. సహాయ కార్యదర్శి రమేష్. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్ రెడ్డి కోశాధికారి వెంకటేష్. సత్యం. బుచ్చన్న విజయ్. అరుణ్ మోహన్ రవి రాఘవేంద్ర. చంటి. అరుణ్ తదితరులుపాల్గొన్నారు.

## 139వ మే డే ‘

## ‘కార్మిక హక్కుల దీక్ష దినం” కరపత్రం ఆవిష్కరణ...!

### మే-డే స్ఫూర్తితో మే 20 జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు..!




రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26. రానున్న 139వ. మే-డే ను కార్మిక హక్కుల దీక్ష దినంగా పాటించాలనే కరపత్రం ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్లో మున్సిపల్ కార్మికుల సమక్షంలో సిఐటియు పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బిక్షపతి, ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మే డే ను ఈసారి కార్మిక హక్కుల సాధన కోసం పోరాట దీక్ష దినంగా జరుపుకోవాలని, 139 సంవత్సరాల కాలంలో అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి కార్మికులు అనేక హక్కులు, కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగింది. పెట్టుబడిదారులు లాభాపేక్షతో కార్మికులను పీల్చి పిప్పి చేసి పని చేయించుకునే ఆ కాలంలో 12గంటలు, 16 గంటలు పని చేయించుకున్న దానిని ప్రతిఘటించి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకోవడం జరిగింది. అలాంటి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినం నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తూ, పెట్టుబడిదారులకు కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తూ 12 గంటల వరకు పని చేయించుకునే విధంగా, 29 చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత చట్టాలనే కొనసాగించాలనీ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించరాదని, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను నిలుపుకోవాలనే తదితర డిమాండ్ల కోసం మే 20న. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను 11 జాతీయ కార్మిక సంఘాలు, వివిధ రంగాల స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు సమ్మె చేయనున్నాయి. అందుకే ఈసారి జరుపుకోనున్న మే డే ను కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల వ్యతిరేక పోరాట దినంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, సిఐటియు ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల. లక్ష్మారెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు పి సునీత, టి. లక్ష్మయ్య, పెగడపల్లి. లక్ష్మణ్, రాణి ,దేవమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మరికల్ కు బయలుదేరిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



ఆత్మకూర్ వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : మరికల్ లో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాల సందర్భంగా బహిరంగ సభకు శనివారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం నుండి వ్యవసాయ కూలీలు బయలుదేరడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు వ్యవసాయ కూలీల సమస్యలపై మాట్లాడడం జరిగింది . ఈ కార్యక్రమం లో వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షు లు ఎస్ రాజు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకట రాములు మరియు మండలంలోని వ్యవసాయ కూలి లు పాల్గొనడం జరిగింది. సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎండి మహమూద్ జెండా ఉపి ప్రారంభించడం జరిగింది.

## “భారత్ సమ్మిట్ - 2025”లో పాల్గొన్న రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్.....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 26. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహిస్తున్న “భారత్ సమ్మిట్ - 2025” కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.ఈ సమ్మిట్‌లో దేశవ్యాప్తంగా ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, శాస్త్రవేత్తలు మరియు విధాన నిర్ణేతలు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సాంకేతిక అభివృద్ధి, నూతన పెట్టుబడుల ప్రోత్సాహం



అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి.ఎం ఎస్ రాజ్ ఠాకూర్ ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి, ముఖ్యంగా రామగుండం నియోజకవర్గానికి వచ్చే అవకాశాలపై దృష్టి సారించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే, తెలంగాణ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి సాధిస్తున్నట్లు తెలియజేశారు.సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాంకేతికత, పరిశ్రమ, వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాల్లో విస్తృత పురోగతిని సాధిస్తూ దేశానికి ఆదర్శంగానిలుస్తోంది. రామగుండం నియోజకవర్గాన్ని కూడా నూతన పెట్టుబడులు, పరిశ్రమల ద్వారా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రముఖులతో సమావేశమై రామగుండం అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో మంత్రి వర్గ సభ్యులు, అధికారులు, ఇతర ముఖ్య వ్యక్తులతో కలిసి పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులను సత్కరించిన బిఆర్ఎస్ నాయకులు...



అశ్వారావుపేట, ఏప్రిల్ 26 (జనం ):అశ్వారావుపేట మండలంలోని స్థానిక వికేడివిఎస్ రాజు కళాశాలలోని 2024-25 వ సంవత్సరాలలో ఇంటర్ ఫలితాల్లో సెకండ్ ఇయర్ ఎంపీసీ లో 993 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించిన విద్యార్థినిలకు అభినందించారు.అలాగే అత్యధిక మార్కులు సాధించిన 17 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులను మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యలో రాణించే వారికి ప్రపంచంలో ఎక్కడైనా మంచి విలువ వస్తుందని, చదువు అనేది కష్టంతో కాదు ఇష్టం తో చదువుకుంటే అనుకున్నది సాధించవచ్చుని, మీరు ఇలాగే చదివి మరింత ఉన్నత స్థానానికి చేరాలని కోరారు.అలాగే విద్యార్థులకు మంచి విద్యతో పాటు క్రమశిక్షణ ను అందించే కళాశాల ప్రిన్సిపాల్ శేషు బాబు ను శాలువాతో సత్కరించారు. వారు



సాధించిన ఘనతను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాష్ రావు, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, మండల నాయకులు తాడేపల్లి రవి, యువజన విభాగం మోటూరి మోహన్, దమ్మపేట మాజీ వైస్ ఎంపీపీ దార మల్లికార్జున్ రావు, ప్రిన్సిపల్ శేషు బాబు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో జాతీయ జెండాలతో ర్యాలీ..

### పాకిస్థాన్ డౌన్ డౌన్ హిందుస్థాన్ జిందాబాద్ అంటూ దద్దరిల్లిన అశ్వారావుపేట

అశ్వారావుపేట, ఏప్రిల్ 26 (జనం):జమ్మూ కశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా అశ్వారావుపేట



ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ పాటించారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో అశ్వారావుపేట రింగ్ రోడ్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్ డౌన్ డౌన్ హిందుస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో అన్నీ పార్టీలా రాజకీయా నాయకులు, వ్యాపారస్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ ప్రధానం.



పొన్నూరు ఏప్రిల్ 26 .జనం రిపోర్టర్:చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన సూర్య చంద్రం జెట్టిబోయిన అనే విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ శనివారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ “ సూపర్‌హైడ్రోఫోబిక్ పోరస్ కోఆర్డినేషన్ పాలిమర్స్ (పీసీపీఎస్) అండ్ నానో షీట్ పీసీపీఎస్ ఫర్ గ్యాస్ స్టోరేజ్ అండ్ ఎలక్ట్రోకెమికల్ వాటర్ స్ప్లిట్టింగ్” అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. ఈయనకు యూనివర్సిటీలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కోయ ప్రభాకర రావు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొంది. విద్యార్థి తన పరిశోధనలో భాగంగా మొత్తం 6 ఎస్‌సీఐఈ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. పీహెచ్‌డీ పట్టా పొందిన సూర్య చంద్రం జెట్టిబోయినను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## ఆకలితో అలమటిస్తున్న అనాధల ఆకలి తీర్చిన “శ్రీ సీతారామచంద్ర స్వచ్ఛంద సేవా సంస్థ”.....



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 26.శనివారం “శ్రీ సీతారామచంద్ర స్వచ్ఛంద సేవా సంస్థ” ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అశోక్ మాతృమూర్తి కీర్తి శేషురాలు, మిట్టపల్లి ఓదమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని పుర వీధులలో ఆకలితో అలమటిస్తున్న అనాధ వృద్ధులకు భిక్షాటన చేస్తూ,




జీవితాన్ని గడుపుతున్న వారికి భోజనం, పండ్లు, స్వీట్స్, వాటర్ బాటిల్ సుమారు 50 మంది అనాధలకు కీర్తి శేషురాలు మిట్టపల్లి ఓదమ్మ జ్ఞాపకార్థంగా వీటిని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో “శ్రీ సీతారామచంద్ర స్వచ్ఛంద సేవా సంస్థ” వ్యవస్థాపక అధ్యక్షుడు మాతంగి శివరాజ్, నీలం కుమార్, గడ్డం వెంకటేష్, తిప్పని తిరుపతి, మార్తా సంజీవ్, కాసిపేట సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానంతో యువకుడి పై హత్యాయత్నం




రేపల్లె (జనం రిపోర్టర్) :భార్య యువకుడితో అక్రమ సంబంధం కలిగి ఉందనే అనుమానంతో యువకుడిని కత్తితో విచక్షణ రహితంగా నరికిన ఘటన పట్టణంలోని ఏడో వార్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు దేవరపల్లి నవీన్ కుమార్ (30) డీఎస్సీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతూ పట్టణంలోని ఏడో వార్డులో తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడు. అతని ఇంటి సమీపంలో ఉన్న దేవరకొండ కోటేశ్వరరావు తన భార్యకు నవీన్ అనే యువకుడికి అక్రమ సంబంధం ఉందని అనుమానంతో శనివారం ఉదయం 11 గంటల సమయంలో నవీన్ ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా కత్తితో తలపై దాడి చేశాడని తెలిపారు. తీవ్ర గాయాలతో రక్త మోడుతున్న నవీన్ ను చుట్టుపక్కల వారు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుని తల్లి స్వరూప రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

## 139వ. మే డే స్ఫూర్తితో
## కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లరద్దుకై పోరాడుదాం... !

### 139వ. మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దు కై పోరాడుదాం...!




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 26. రామగుండం:ఏప్రిల్ 26. సింగరేణి కాలరీ స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి అశోక్ కార్మిక లోకానికి పిలుపు ఇచ్చారు. శనివారం ఆర్.జి 2 డివిజన్ లోని రైల్వే సైడింగ్ వద్ద 139వ “మే డే” పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా బి అశోక్ మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేసి దేశంలో ఉన్న 50 కోట్ల మంది కార్మికుల సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత నరేంద్ర మోడీ ప్రభుత్వం విస్మరించడం శోచనీయమని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అధిపతులు అంబానీ,ఆదానీ లకు ప్రజా సంపదను కట్టబెట్టేందుకే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక వర్గానికి మరణశాసనం రాసారని అన్నారు.కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేయడం ఆపి, రక్షించాలని, సుప్రీంకోర్టు 2016 అక్టోబర్ 26 తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంటాక్ట్ కార్మికులందరికీ ఆల్ ఇండియా వేతనాలు,పీఎఫ్, ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె వెంకటేష్, పావురాల వెంకటి, అయిలయ్య, సదానందం, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం..

### కూటమి ప్రభుత్వంలో పారదర్శక పరిపాలన కొనసాగుతుంది..

### ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.




ఎన్టీఆర్ జిల్లా, నందిగామ, ఏప్రిల్ 26 :(జనం రిపోర్టర్) : నందిగామ పట్టణం కాకాని నగర్ నందు ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విజయవాడ మాజీ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ నాని కూటమి ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తూ వారి కార్యాలయంలో ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నాని ఎన్ని ముడుపులు తీసుకున్నావు ఆనాడు ఇసుక టన్ను వేల నుంచి లక్షల రూపాయలలో రాష్ట్రాలు రాష్ట్రాలు తరలి వెళ్ళిపోయిన నాడు నాని నోరు ఎందుకు మెదపలేదు? ఈనాడు కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు అందిస్తుంటే దానిపై కూడా నువ్వు చేస్తున్న రాజకీయ విమర్శలు నీ రాజకీయ అజ్ఞానికి నిదర్శనం. ఆనాడు వైసీపీ జగన్ రెడ్డి పాలనలో ల్యాండ్, సాండ్, వైన్, మైన్ అన్నిటిలో అక్రమాలు జరిగితే జగన్మోహన్ రెడ్డిని నువ్వు ఎందుకు ప్రశ్నించలేక పోయావు? పైగా ఆనాడు స్థానికంగా ఇక్కడ ఉన్న ఎమ్మెల్యేని పొగుడుతూ రాజకీయాల్లో మంచి చేయాలి మంచి చేసిన వారికీ ప్రజలలో ఎప్పుడు గుర్తింపు ఉంటుంది అని దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడవు చివరికి మీ మంచి, మీ స్థానాన్ని ప్రజలు గుర్తించి ఎక్కడ ఉంచాలో నిర్దేశించి మీకు ఈ రోజు ఈ స్థానం కల్పించారు. ఆ నాటి వాసులు బ్రదర్స్ దోపిడీలలో మీ వాటాలు ఎంత? గత దోపిడీ ప్రభుత్వాన్ని నాని కళ్ళు ఉండి చూసి ఎందుకు ప్రశ్నించలేక పోయావు? కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పాలనా కొనసాగిస్తుంటే చూసి ఓర్వ లేని జగన్ నాని అనే వ్యక్తితో మాట్లాడిస్తున్న మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నేతలలో అగ్రగామి నారా చంద్రబాబు నాయుడు ని కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు.

## శ్రీ ఆవాల ప్రవీణ్ గారి జన్మదినం సందర్భంగా మంచి కార్యం

### హెూప్స్ ఫౌండేషన్ - దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ సంయుక్తంగా భోజన పంపిణీ



పొదిలి (జనం రిపోర్టర్) :ఈ రోజు హైదరాబాద్‌కు చెందిన శ్రీ ఆవాల ప్రవీణ్ గారి పుట్టినరోజు సందర్భంగా, వారి అత్తయ్య నందిత గారు, మామయ్య రామారావు గారు ఒక మంచి ఉద్దేశంతో పునీత కార్యానికి ముందుకొచ్చారు. ప్రవీణ్ గారి జన్మదినాన్ని స్మరణీయంగా మార్చాలన్న తపనతో, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నలుగురు నిరుపేదలకు భోజనం అందించాలన్న సంకల్పం తీసుకున్నారు.ఈ ఉద్దేశాన్ని సాకారం చేయడంలో హెూప్స్ ఫౌండేషన్ మరియు దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషించాయి. ఈ రెండు ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో, పొదిలి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు మరియు యాచకులకు ఆహారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో హెూప్స్ ఫౌండేషన్ ఫౌండర్ నరసింహారావు గారు మరియు రాధ గారు ప్రత్యేకంగా పాల్గొన్నారు. వారి సహకారంతో ఈ సామాజిక సేవా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో జరగాలని, ప్రతి పుట్టినరోజు ఒక మంచి కార్యక్రమానికి ప్రేరణగా మారాలని ఆశిస్తూ, శ్రీ ఆవాల ప్రవీణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నాము.

## మద్యం మత్తులు ఓ వ్యక్తి మృతి



రేపల్లె, (జనం రిపోర్టర్) :ఓర్చు నాగరాజు తండ్రి ఏడుకొండలు వయసు 37 సంవత్సరాలు %జ%/ వడ్డెర 14 వ వార్డు రేపల్లె అను అతను గత రెండు రోజులుగా మద్యం సేవిస్తూ ఇంటికి వెళ్లనట్లు, ది 26.04.2025 ఉదయము షుమారు 10 గంటల సమయములో మృతుడు అయిన ఓర్చు నాగరాజు %ూదీ=% డిగ్రీ కాలేజీ వెనుక గల పొలములో చనిపోయి ఉన్నట్లుగా మృతుని భార్య అయిన భావాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు రేపల్లె పట్టణ %జ×% శ్రీ %ూ% మల్లిఖార్జునరావు గారు తెలిపినారు. మృతునికి ఇద్దరు కుమారులు కలరు. టాపి పని చేస్తూ ఉంటాడు.

## పరామర్శించిన ఆలూరు సాంబశివారెడ్డి.



శింగనమల(జనం రిపోర్టర్) : :టిడిపి నాయకులు చేసిన దాడిలో గాయపడిన వైఎస్ఆర్సిపి నాయకుడు అంజన్ రెడ్డిని వైఎస్ఆర్సిపి ఎన్.ఆర్.ఐ వింగ్ కో- ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి శనివారం పరామర్శించారు.కొద్దిరోజుల క్రితం శింగనమల మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ నాయకుడు అంజన్ రెడ్డి పై లోలూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిలో గాయపడిన అంజన్ రెడ్డిని పరామర్శించి, ఆరోగ్య విషయంపై అడిగి తెలుసుకోవడంతో పాటు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని వారికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.అనంతరం మండల కేంద్రంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ నాయకుడు సి. ఆదిరెడ్డి కుమారుడు సి. హరనాథ్ రెడ్డి(28) ఉద్యోగం రాలేదని మనస్థాపంతో గత కొద్దిరోజుల క్రితం తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకొన్న



ఆలూరు సాంబ శివారెడ్డి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన రెస్టారెంట్ ను ప్రారంభించిన మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి గారు మరియు చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ భీమ్ భరత్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: చేవెళ్ల (జనం రిపోర్టర్) : చేవెళ్ల నియోజకవర్గం లోని శంకర్పల్లి మండలం పరిధిలోని మోకిల గ్రామ చౌరస్తా వద్ద చెవుల అరుణ్ కుమార్, మహేందర్ గారు (గొల్లగూడ ) నూతనంగా ఏర్పాటు చేసిన మసాలా వైభవం మల్టి కుసైన్ రెస్టారెంట్ కి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన మాజీ చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి మరియు వీరితో పాటుగా చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ ప్రారంభించారు



....ఈ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ పల్లీ మండలం అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య , నవాబ్ పేట మండలం అధ్యక్షులు వెంకటయ్య , చేవెళ్ళ మాజీ సర్పంచ్ ఆగిరెడ్డీ , పి ఎ సి ఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి , మధుసూదన్ గుప్తా , మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ప్రశాంత్ , అస్తర్ , ఇంద్ర రెడ్డి , శరత్ రెడ్డి , శ్రీకాంత్ , ఎంపీటీసీ గణేష్ , కేబుల్ రాజు, శ్రీధర్ , మరియు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు......

## మేడేను ఘనంగా జరిపేందుకు ప్రత్యేక చర్యలు




రేపల్లె (జనం రిపోర్టర్) :ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను....లేబర్ కోడులను నిరసిస్తూ మే20 సమ్మెను జయప్రదంచేయాలని...సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్. మణిలాల్ పిలుపునిచ్చారులి సిఐటియు రేపల్లె కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు జె.ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్.మణిలాల్ మాట్లాడుతూ మేడేని రేపల్లె నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలన్నారు.ఎనిమిది గంటల పనివిధానం కోసం జరిగిన పోరాట ఫలితంగా మేడే సాధించుకున్నా మన్నారు.పెట్టుబడి దారులు 8 గంటలు పని విధానానికి తిలోదకాలు ఇచ్చి 10 గంటలునుండి 14గంటలు పని చేయిస్తున్నారని చెప్పారు. దీనికి నిరసనగా మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి,ఎల్అండ్ టి సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు పని చేయాలని,ఆదివారాలు కూడా పనిచేయాలని కార్మికవర్గానికి చెప్పటం అంటే పెట్టుబడిదారుల ధన దాహం ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. నేడు కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలన్నీ కూడా మార్పులు చేస్తూ నాలుగు లేబర్ కోడలుగా చట్టాలను మార్చిందని,అవి అమల్లోకి వస్తే కార్మికులు బానిసలవుతారు,సమ్మె హక్కు కూడా ఉండదని,దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కేంద్ర కార్మికసంఘాలు మే20న సమ్మెకు పిలుపులిస్తున్నాయన్నారు.రేపల్లె ప్రాంతంలో కార్మికులతో విస్తత సమావేశాలు జరిపి,మేడే,మే20 జరుగుతున్న సమ్మెకు ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు వివిధ ఆశ అంగన్వాడి,భవననిర్మాణం,ఆటో,ముఠా,రైస్ మిల్,మున్సిపల్ సంఘాల నాయకులు గ్లోరీ,యు.రామకృష్ణ ప్రసాద్, డి.ప్రభాకరరావు,ఎస్ కె.కాలేషా, కే.రాము,వై.వాసు,డి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

## బాలలపై జరుగుతున్న లైంగిక దోపిడీని నిరోధించడానికి మత పెద్దల పాత్ర ప్రాముఖ్యమైందని బిషప్ జన్ను ఇర్మియా



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) : శనివారం రోజున ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో వరంగల్ లోని పైడిపల్లి గ్రామం నందు కల్వరి బైబిల్ చర్చి లో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన వరంగల్ త్రినగర పరిధిలోని క్రైస్తవ పాస్టర్స్ కు కమ్యూనిటీ పెద్దలకు మరియు టీచర్స్ కు బాలలపై జరుగుతున్న లైంగిక దోపిడీని నిరోధించడంలో మత పెద్దల పాత్ర అనే అంశం పైన అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది ఈ యొక్క సదస్సుకు ముఖ్యఅతిథిగా బిషప్ జన్ను ఇర్మియ హాజరై ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా మరియు బాలలను అనేక రకాలుగా లైంగిక దోపిడీలకు ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ రూపంలో గురి చేయడం జరుగుతుందని దీన్ని నిర్మూలించడం కొరకు ప్రజల్లో తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కలిగించాలని ఎవరైనా బాధిత కుటుంబాలు ఉన్నట్లయితే వారిని చేరదీసి సరైన చర్యలు తీసుకోవాలని ఒకవేళ పిల్లల హక్కులకు భంగం కలిగిన ,బాలలపై లైంగిక దాడులకు ఎవరైనా ప్రయత్నం చేసిన అటువంటి సమస్యలను గుర్తించి చైల్డ్ లైన్ 1098 పోలీసు 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు అంతేకాకుండా బాలలపై జరుగుతున్న లైంగిక దోపిడీలు నిరోధించడంలో క్రైస్తవ మత పెద్దలకు పాస్టర్లకు సామాజిక బాధ్యత ఉందని పాస్టర్ కే నరేష్ కు సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో నందు సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఫైనాన్స్ మేనేజర్ అజయ్ కుమార్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ తో పాటు పాస్టర్ల సహవాసం బాధ్యులు జూపాక యాకోబ్, ఎర్రోళ్ల ప్రభాకర్, స్థానిక పాస్టర్ ఏ.రవి పాల్, దామెర శ్యామ్,వరంగల్ మూడో డివిజన్లో నుంచి సుమారు 80 మంది దైవ సేవకులు,పాస్టర్లు ,నాయకులు ,సువార్తికులు పాల్గొనడం జరిగింది



## ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు హన్మకొండ జిల్లా కలెక్టర్ కు పిర్యాదు



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) :హసన్ పర్తి మండలం సీతంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని,ఆ జాబితాను రద్దు చేయాలని గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గుంపుల రణధీర్ రెడ్డి శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు పిర్యాదు చేశారు.సీతంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులము గ్రామ పంచాయతీలో కార్యదర్శి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసుకొని 20 మంది లబ్దిదారులను ఎంపిక చేసి అట్టి తీర్మానంపై కమిటీ సభ్యులను సంతకాలు చేశామని తెలిపారు.ఇటీవల తనకు తెలియకుండా రెండవసారి 24 మంది లబ్దిదారులతో కూడిన మరో జాబితాను ఎంపీడీఓ కు సమర్పించినారని తెలిపారు.రెండవ జాబితాలో తన సంతకాన్ని మరొక్కరు ఫోర్జరీ చేశారని పిర్యాదులో పేర్కొన్నారు.లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ జాబితాను రద్దు పరచాలని రణధీర్ రెడ్డి పిర్యాదులో పేర్కొన్నారు.

## అవిశ్వాసానికి నేను మద్దతు ఇవ్వడం లేదు కౌన్సిలర్ సతీష్ రెడ్డి



మడకశిర(జనం రిపోర్టర్) :మడకశిర నగర పంచాయతీ అధ్యక్ష మరియు ఉపాధ్యక్షులు పై అవిశ్వాస తీర్మానాని కి కొంతమంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ కి అర్జీ ఇచ్చినట్లు తెలిసింది అందులో నేను అవిశ్వాసానికి మద్దతు ఇచ్చి సంతకం చేసినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. నేను మద్దతుగా ఎలాంటి సంతకం చేయలేదు నా సంతకంతో అర్జీ ఇచ్చి ఉంటే అర్జీలో నా సంతకమును ఫోర్జరీ చేసినట్లే విజువైతే జిల్లా కలెక్టర్ అర్జీని తిరస్కరించి నా సంతకం ఎవరైతే చేసినారో అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు నేను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన నాటి నుండి ఆ పార్టీ అభిమాని గా కార్యకర్త గా ఉన్నాను.భవిష్యత్తులో కూడా మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులుహ వైయస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే నడుస్తాను అని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు

## ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు.



మొగల్తూరు, ఏప్రిల్ 26జనం రిపోర్టర్: మొగల్తూరు దయాళ్ దాస్ పేటలో వేంచేసియున్న శ్రీభూ సమేత వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు గత నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23న స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం, 24న విశేష ఆరాధన, 25న వేద స్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం 7 గంటల నుండి స్వామివారిని ప్రత్యేక వాహనంపై బాజా బజంత్రీలతో భక్తులు వెంకటేశ్వరస్వామి భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. 27వ తేది ఆదివారం రాత్రి వార్షిక కల్యాణోత్సవాలు ముగింపు సందర్భం గా ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## : లేబాక లో నాకాబంది



నందలూరు,(జనం రిపోర్టర్) :మండలంలోని లేబాక గ్రామంలో శనివారం నాకాబంది నిర్వహించినట్లు రాజంపేట రూరల్ సీఐ బీ.వీ రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. నాకాబంది సందర్భంగా గ్రామస్తులకు గ్రామంలో జరిగే అవాంఛనీయ సంఘటనలు, మైనర్ డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించారు. రికార్డ్స్ లేని 12 మోటార్ సైకిల్ ను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు ఇన్చార్జి ఎస్ఐ మోహన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానిక ప్రతీక గులాబీ జెండా అభిమానం మళ్ళీ చిగురిస్తోంది!



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్(జనం రిపోర్టర్) :స్వ రాష్ట్రం కోసం పుట్టిన జంట పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన గౌరవజెండా మన గులాబీ జెండా.ఈ గర్వదినాన్ని పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్నగర్ డివిజన్, మహేశ్వరం నియోజకవర్గం మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ కాలనీలో గులాబీ జెండాను ఉత్థానంగా ఆవిష్కరించారు మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "తెలంగాణ ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం పరంగా దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతి ఒక్కరూ రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములై ముందుకు సాగాలి," అని పేర్కొన్నారు.ఓరుగల్లు మహాసభను ఘనంగా విజయవంతం చేయాలని పిలుపు నిచ్చిన ఆమె, భారీ బైక్ ర్యాలీకి శ్రీకారం చుట్టారు.



పట్టణ వీధుల్లో భారీ సంఖ్యలో యువతీ యువకులు బైక్ లపై తెలంగాణ నినాదాలతో ఊరేగిపోగా, ప్రజల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహభరితంగా జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో అంకి రెడ్డి , రాష్ట్ర సీనియర్ నాయకులు సాజిద్, రాగం ఎల్లయ్య యాదవ్ , మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ గౌని శ్రీనివాస్ గౌడ్ ,సోషల్ మీడియా కన్వీనర్ వుత్తుపల్లి శ్రీనివాస్ ,సుశీల రెడ్డి , రాజేష్ గౌడ్ , కొండా గిరి గౌడ్ ,రిషి , గోవర్ధన్ రెడ్డి ,జహీర్ ,ప్రత్యుష్ ,రాగం సునీల్ యాదవ్ ,కదారి రాజు యాదవ్ ,ఆకుల అరుణ్ కుమార్ , కిరణ్ , సాయి కిరణ్ ,రాగం సురేష్ యాదవ్ ,ఫయాజ్ , కట్ట ప్రవీణ్ ,తేజ ,సాలమ్మ ,రజాక్ ,సాజిద్, రాజశేఖర్ , గుఫ్రాన్ ,భాగ్య లక్ష్మి , మదర్ ,బాలరాజ్ సుధ ,శృతి , జహంగీర్ ,నరేశ్ గౌడ్ , యాదగిరి , దేవరాజ్ , శివ ముదిరాజ్ , ఏలాద్రి ,కిశోర్ , మురళి ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ర్యాలీ నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు




నందలూరు, (జనం రిపోర్టర్) :మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం నిర్వహించునున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నాగిరెడ్డిపల్లి నందు జరిగిన కార్యక్రమంలో నందలూరు మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని మండల విద్యాశాఖ అధికారులు ఎల్. నాగయ్య మరియు సి ఆర్ అనంతకృష్ణ లు తెలియజేశారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల ప్రథమ స్థానంలో టి. మణిదీప్ 589 మార్కులు ( జడ్.పి.హెచ్.ఎస్ పాటూరు), 2రెండవ స్థానంలో కె వెంకట శైలజ 579 మార్కులు( ఎం జె పి బి సి వెల్ఫేర్ స్కూల్), మూడో స్థానంలో ఎం షణ్ముఖ శ్రీనివాస్ 578 మార్కులు (జడ్పీహెచ్ఎస్ పాటూరు) సాధించారు. మండలంలోని ప్రభుత్వ హైస్కూల్ అన్నింటిలో కలిపి దాదాపుగా 20 మంది విద్యార్థులు 500 కు పైగా మార్పులు సాధించారు.అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి తల్లిదండ్రులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తి గా ఉచితంగా విద్యను పొందవచ్చని అందుకు ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తుందని, మీ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఎల్లవేళలా మా ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని మండల ప్రజలందరికీ తెలియజేస్తున్నాం. మీ పిల్లలందరినీ ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మన ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి చదివించుకోవాలని ప్రజలందరినీ కోరుచున్నామనీ మండల విద్యాశాఖ అధికారులు తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారులు మరియు మండల ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం గ్రామంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జనరల్ సెక్రెటరీ లీలా కృష్ణయ్య, ప్రెసిడెంట్ షఫీ ఉల్లా, మహేశ్వర బాబు, సంజీవ ప్రసాద్, అశోక్ కుమార్, రమేష్ బాబు, కృపానందం, లక్ష్మీ రాజ్యం, లక్ష్మీకాంతమ్మ, గాయత్రి దేవి,సందాని తదితర మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడి మృతులకు పట్టణ ముస్లిం కమిటీ నివాళి




అమరచింత వనపర్తి జిల్లా ప్రజ లది(జనం రిపోర్టర్) :అమరచింత ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో కాశ్మీర్ లోని పహాల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన అమర కుటుంబాలకు శనివారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రదాడి చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఉగ్ర దాడిలో పాల్పడిన వారికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఆర్మీలో నియామకాలు ఖాళీగా ఉండకుండా వెంటనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు తౌఫిక్ ఆశు.పాషా నిస్సార్ ఖాసిం ఇమ్రాన్ సమీర్ కరీం తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ బి. ఆర్. ఎస్ శ్రేయును అభిమానులకు మంద సంజీవరెడ్డి పిలుపు "చలో వరంగల్" రజోత్సవని విజయవంతం చేయాలి ది మంద సంజీవరెడ్డి



బోడుప్పల్ (జనం రిపోర్టర్) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బి.ఆర్.ఎస్ పార్టీ బోడుప్పల్ కార్యాలయంలో పత్రికా సమావేశం లో ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ, వరంగల్లో జరగబోయే బి.ఆర్.ఎస్ పార్టీ 25వ రజతోత్సవ మహా సభకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి బి.ఆర్.ఎస్ కార్యకర్తలు , యువకులు , మహిళలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. బోడుప్పల్ పద్మావతి కాలనీ నుండి మొదలై వీరారెడ్డి చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం, ఎన్.టి.అర్. విగ్రహం దగ్గర నుండి బయలుదేరుతారు అని తెలిపినారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ లక్ష్మీ రవి గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్



(జనం రిపోర్టర్) :ఈరోజు అనగా 26. 04.2025 రోజు తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో భువనేశ్వరి కాలనీ పెద్ద అంబర్పేట నందు అబ్దుల్ ఖాదర్ జిలాని ఇంటి నందు దోమల కోసం పెట్టిన మస్కిటో కాయిల్ ప్రమాదవశాత్తు జిలాని పిల్లలు అబ్దుల్ రెహమాన్, ఆతిఫా పడుకున్న పరుపుపై పడి పరుపు కాలిపోగా ప్రమాదంలో పొగకు ఊపిరడగా జిలానీ కుమారుడు అబ్దుల్ రెహమాన్ స్పాట్లోనే చనిపోవడం జరిగింది. జిలాని కూతురు ఆతిఫా ఆరోగ్యం విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం నీలోఫర్ హాస్పిటల్ కు తీసుకు వెళ్ళడం జరిగింది.అబ్దుల్ రెహమాన్ కు నలుగురు పిల్లలు ఇద్దరు కూతుళ్లు ఇద్దరు కుమారులు. అబ్దుల్ రెహమాన్ తన పెద్ద కొడుకు అర్హన్, పెద్ద కూతురు ఆఫియా కలసి హాల్ నందు పడుకోవటం జరిగింది. జిలానీ భార్య ఫౌజియ బేగం, మృతుడు అబ్దుల్ రెహమాన్, వయసు 4 సం.లు, ఆతిఫా, వయసు 4 సం.లు లు బెడ్ రూమ్ నందు పడుకోవటం జరిగినది.

## పదో తరగతి విద్యార్థులకు అభినందన



రేపల్లె, (జనం రిపోర్టర్) :శ్రీ పరుచూరి బలరామయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలి2024-2025 సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షల నందు అత్యధిక ఉత్తీర్ణత మార్కులు ఫస్ట్ సెకండ్ థర్డ్ మార్కులురావడం జరిగినది...1.గూడపాటి పూర్ణ సుధీర్ 588/600లి2.కాగిత సుధీర్లి580/600లి3.విన్నకోట షణ్ముఖ దుర్గా రామ్ 570/600వీరికి అత్యధిక మార్కులు వచ్చినందుకుమన గ్రామ సర్పంచ్ గారైనశ్రీమతి కనపర్తి వసుమతి గారిలికుమారుడుకనపర్తి రవికిరణ్ గారులి వారికి ముందుగా అభినందనలు తెలియజేయడం జరిగినది...ఈ కార్యక్రమానికిమాజీ ఎంపీటీసీ సభ్యులు రావు ప్రభాకర్ రావు గారుమరియు గ్రామ పెద్దలుఆ చిన్నారులను అభినందించి శాలువాతో సత్కరించిలిస్వీట్లు మరియులిపెన్నులుఇచ్చి అభినందించడం జరిగింది...రానున్న రోజుల్లో ఉన్నత చదువులు చదివి బాగా అభివృద్ధి చెందాలని తెలియజేయడం జరిగినది....

## వరంగల్ లో జరిగే బి ఆర్ఎస్పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**బి ఆర్ఎస్ పార్టీ నవాబ్ పేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్ మాట్లాడుతూ....!!**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: నవాబుపేట్ (జనం రిపోర్టర్) :తెలంగాణ ఉద్యమాన్ని కెసిఆర్ పిడికెడు మందితో ప్రారంభించి ఉద్యమంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కెసిఆర్దే అని అన్నారు. సాధించిన తెలంగాణ ను 10 సంవత్సరాలు దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దిన చరిత్ర కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీదే అని అన్నారు ఈనెల 27 వ తేదీన వరంగల్ లో జరిగే టిఆర్ఎస్పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు.గత పది సంవత్సరాల కాలంలో కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రము స్వర్ణ యుగంగా వర్ధిల్లింది.పార్టీ పుట్టి 25 ఏళ్ళు పురుడు పోసుకున్న సందర్భంగా వరంగల్ లో జరిగే రజతోత్సవ సభను యావత్తు దేశమే ఎదురుచూస్తున్న సందర్భంగా మనం ప్రతి గ్రామంలో బిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ చేసి వరంగల్ సభకు బయలుదేరాలని అన్నారు.నవాబుపేట్ మండలం నుండి 20 బస్సుల్లో మరియు బిఆర్ఎస్ నాయకుల సొంత వాహనాలు వెయ్యికి పైగా జనాలను తరలి వెళ్తారని తెలిపారు

## శ్రీ చిన్మయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఇంటర్ విద్య

మడకశిర (జనం రిపోర్టర్) :10వ తరగతిలో 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత ఇంటర్ విద్య అందించేందుకు శ్రీ చిన్మయి సేవ ట్రస్ట్ తరపున టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు, అంతేకాక ప్రథమ, ద్వితీయ ,తృతీయ ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ పరీక్షను పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో మే 1,2,3 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్యలో ఉంటుందని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితాను తీసుకురావాలని తెలిపారు. ఈ సదవకాశాన్ని మడకశిర నియోజకవర్గం లోని పదవ తరగతిలో 500 పైన మార్కు సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కావున ఆసక్తిగల విద్యార్థులు సంప్రదించు నెంబర్లు 7013721155,7416054685

## నార్పల మేజర్ గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గా దూదేకుల గౌసియా



నార్పల(జనం రిపోర్టర్) :నార్పల మేజర్ గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గా , బాధ్యతలు స్వీకరించిన దూదేకుల గౌసియా ఉరవకొండ గ్రామపంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న పి సుబహాన్ ఇటీవల కాలంలో హఠాత్తు మరణించడం జరిగింది కారుణ్య నియామ కింద సుభాన్ కూతురు అయినటువంటి దూదేకుల గౌసియాకు నార్పల పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వడం జరిగింది అదేవిధంగా ఆమె మాట్లాడుతూ నార్పల మేజర్ గ్రామపంచాయతీకి నా వంతు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఇంటి పన్నులు కొళాయి పన్నులు అంగడి లైసెన్స్ గ్రామపంచాయతీకి ఆదాయపలమిచ్చు ఏవైనా బకాయిలు ఉన్నచో అవన్నీ సక్రమంగా వసూలు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధి బాటలో నడిపిస్తానని తెలియజేయడం జరిగింది

## అసత్య ప్రచారాలు మానుకోండి..! కౌన్సిలర్లు

మడకశిర (జనం రిపోర్టర్) :మడకశిర పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ సొంత పార్టీ ఆగడాల భరించలేకనే తెలుగుదేశం పార్టీలోకి వైసిపి కౌన్సిలర్లు స్వయంగా వచ్చారని 13 మంది కౌన్సిలర్లు పేర్కొన్నారు, శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ:- వైసీపీకి చెందిన కౌన్సిలర్లు మేము ప్రలోభ పెడితేనే వచ్చారని దుష్ప్రచారం చేస్తున్నారని ఇది ముమ్మాటికి అవాస్తవమన్నారు, గత వైసిపి పాలకులు మమ్ములను నమ్మించి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత మడకశిర పట్టణ వార్డులలో అభివృద్ధి పనులు జరగనీయకుండా అడుగడుగునా అడ్డు తగిలి కౌన్సిలర్లను కేవలం పోస్టులకే పరిమితం చేశారు వార్డులలో ఉన్న సమస్యలను నాలుగు సంవత్సరాలలో పరిష్కరించలేక విసుగు చెందామని కేవలం ఓ ప్రధాన పత్రిక తెలుగుదేశం పార్టీ నాయకుల పైన కౌన్సిలర్ల పైన తప్పుడు ప్రచారాలు, తప్పుడు రాతలు రాస్తూ, పబ్బం గడుపుకుంటుందని తెలిపారు, అందరి సమ్మతితోనే చైర్మన్ లక్ష్మీనరసమ్మ పై అవిశ్వాస తీర్మాన నానికి జిల్లా కలెక్టర్ చేతన్ సార్ కు తాము వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. ఒక కౌన్సిలర్ నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని అది ముమ్మాటికి అసత్యమని అన్నారు గత వైసిపి ప్రభుత్వం లో కౌన్సిలర్లు నష్టపోయామని గత ఎమ్మెల్యే తిప్పేస్వామి, చైర్ పర్సన్ లక్ష్మీ నరసమ్మ. కౌన్సిలర్లను దృష్టిలో ఉంచకొని వార్డులలో అభివృద్ధి పనులు చేయలేకపోయారని మమ్మల్ని కౌన్సిలర్ లుగా ఎన్నడు వైసిపి ప్రభుత్వం గుర్తించలేదని . వైసిపి ప్రభుత్వం నుండి ప్రజలకు ఒరిగిందేమీ లేదని నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని ఇప్పుడు గెలిచిన కూతమి ప్రభుత్వం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు . మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పది నెలల నుండి చేస్తున్న అభివృద్ధిని చూసి మేమే స్వచ్ఛందంగా వైసిపి పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని వారు తెలిపారు . ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారిపై అసత్య ప్రచారాలు మానుకొని తప్పుడు వార్తలు రాయకూడదని వారు తెలిపారు , ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరసింహారాజు , సుభద్ర నాగేంద్ర ,రమేష్ ,దాసప్ప,ఉమాశంకర్, హనుమంతు ,శ్రీనివాసులు,సుధాకర్ నాయక్ ,బలరాం,సత్యసాయి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్ ,తదితరులు పాల్గొన్నారు,

## పహల్‌గామ్ ఉగ్రదాడిపై విచారణకు సిద్ధం: పాక్ ప్రధాని



ఫహల్‌గామ్‌లో ఈ నెల 22వ తేదీన ఉగ్రవాదులు మారణకాండ సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ దారుణానికి ఒడిగట్టింది.. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులే అని అందరికీ తెలుసు. ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించిన దేశ ప్రజలు పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కేంద్రం కూడా పాకిస్థాన్‌పై ప్రతిదాడిని ప్రారంభించింది. సింధు జలలా ఒప్పందం నిలిపివేత.. భారత్‌లో నివసిస్తున్న పాక్ పౌరుల వీసా రద్దు వంటి చర్యలను చేపట్టింది. కానీ, పాక్ ప్రధాని మాత్రం తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. పహల్‌గామ్ ఉగ్రవాద దాడిపై విచారణకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ అన్నారు. తటస్థ, పారదర్శక, విశ్వసనీయ విచారణకు సిద్ధమని ఆయన తెలిపారు. బాధ్యతాయుత దేశంగా విచారణలో పాల్గొంటామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో తమదేశం ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.ం

## కెటిఆర్ పై ఫిర్యాదు.. తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిలు నకిలీ వీడియోలను విడుదల చేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. దీంతో గతేడాది మే 25న వారిద్దరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కెటిఆర్, జగదీశ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయస్థానం విచారణ చేపట్టగా.. వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కెటిఆర్, జగదీశ్ రెడ్డిలు వ్యాఖ్యలు చేయలేదని.. రాజకీయ కక్షసాధింపులో భాగంగా కేసు నమోదు చేశారని..కాబట్టి ఈ కేసును కొట్టివేయాలని పిటిషనర్ల తరపున న్యాయ వాది వాదనలు వినిపించారు. దీంతో పోలీసులు, తీన్మార్ మల్లన్నకు కోర్టు నోటీసులు జారీ చేసిందది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణ జూన్ 13కు హైకోర్టు వాయిదా వేసింది.

## ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు కూల్చేసిన భారత ఆర్మీ



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. లష్కరే టెర్రరిస్టులు, అనుమానితులను పట్టుకునేందుకు భారత్ ఆర్మీ కాశ్మీర్ వ్యాప్తంగా జల్లెడ పడుతోంది. ఈ క్రమంలో ఐదుగురు ఉగ్రవాదుల ఇండ్లను పేల్చేస్తున్నారు. శుక్రవారం రాత్రి.. ఎసాన్ ఉల్ హక్, షబీర్ అహ్మద్ కుట్టే, జకీర్ గని, షాహిద్ అహ్మద్, అషాన్ షేక్ అనే ఉగ్రవాదుల ఇళ్లను సైనికులు కూల్చేశారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మాకు సంబంధం లేదంటూనే సరిహద్దులో పాక్ భారీగా సైన్యాన్ని మోహరిస్తోంది. గత రెండు రోజులుగా రాత్రి సమయంలో సరిహద్దులో పాక్ కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దీంతో భారత ఆర్మీ.. పాక్ కాల్పులను తిప్పికొడుతోంది. ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు ఆర్మీ ఉన్నతాధికారులు తెలిపారు.

## కర్రెగుట్టల అడవుల్లో కూంబింగ్ - అగ్రనేతలే టార్గెట్



ములుగు : తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పరిధిలోని ములుగు జిల్లా కర్రెగుట్టల వద్ద ఐదు రోజులుగా మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా పోలీస్ బలగాలు సెర్చింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పోలీస్ బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టగా హెలిక్యాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహిస్తూ అణువణువు నిశితంగా తనిఖీ చేస్తున్నారు. దీంతో జిల్లాలోని వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు పీఎల్‌జీఏ మహిళా సభ్యులు మఅతి చెందగా, పలువురు మావోయిస్టులు గాయపడినట్టు బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. మావోయిస్టుకి చెందిన డంపు లభ్యమైనట్టు ప్రచారం జరుగుతున్నది. డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్, సీఆర్పీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ చేపట్టిన ఈ జాయింట్ ఆపరేషన్ బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పీ నేతఅత్వంలో కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. కర్రెగుట్టల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆపరేషన్ హిడ్మా పేరుతో మావోయిస్టు పార్టీ మిలటరీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న హిడ్మాను టార్గెట్‌గా చేసుకొని కేంద్ర బలగాలు సెర్చింగ్ నిర్వహిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం హిడ్మా రెండు ప్లాటూన్ దళాలను వెంట పెట్టుకొని కర్రెగుట్టలకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలో ఉన్న కర్రెగుట్టలపై మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయని అంచనా వేసినప్పటికీ అనూహ్యంగా కర్రెగుట్టల వద్ద హిడ్మా వచ్చాడనే సమాచారంతో అధికారులు కేంద్ర బలగాలను అప్రమత్తం చేసినట్టు తెలుస్తున్నది. మిలటరీ ప్లాటూన్ బదలాయించడంతో పాటు మావోయిస్టుల శిక్షణకు సంబంధించిన వ్యవహారాలను చక్కబెట్టేందుకు హిడ్మా కర్రెగుట్టలపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు పోలీసు అధికారులు భావిస్తున్నారు. కర్రె గుట్టలపై మావోయిస్టులు మందు పాతర్లతో పాటు బంకర్లను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తుంది. కర్రె గుట్టల వద్ద ఛత్తీస్‌గఢ్ బలగాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో గుట్టమీద ఉన్న మావోయిస్టులు తప్పించుకొని రాష్ట్రంలోకి చొరబడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసిన అధికారులు సరిహద్దు గ్రామాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నట్టు తెలుస్తున్నది.

# రమణీయం..చారిత్రక దృశ్యకావ్యం

### చారిత్రక సంపదకు, ప్రకృతి సోయగాలకు నెలవు నాగార్జున కొండ నాటి చరిత్రకు ప్రతిరూపం అనుపు వేసవి సెలవుల్లో వినోదం.. విజ్ఞానదాయకం



విజయపురిసౌత్: విద్యార్థులకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు అతి సమీపంలో ఉన్న నాగార్జున సాగర్‌ను కుటుంబ సమేతంగా వేసవి సెలవుల్లో చూడాల్సిందే. సాగర్ పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది. చారిత్రాత్మకమైన ప్రాంతమే కాకుండా సాంకేతిక పరంగా సాగర్ ప్రాజెక్టు సందర్శన ఎంతో విజ్ఞానదాయకంగా నిలుస్తోంది. కృష్ణా జలాశయంలో లాంచీ ప్రయాణం ఆహ్లాదకరం. లాంచీలో ప్రయాణించి జలాశయం మధ్యన ఎనలేని ప్రశస్తి ఉన్న నాగార్జునకొండ మ్యూజియం సందర్శించాల్సిందే. ప్రపంచంలోనే మానవ నిర్మిత ఐలాండ్ మ్యూజియంలలో నాగార్జునకొండ రెండవది. ఆచార్య నాగార్జునుని విశ్వవిద్యాలయం ఇక్కడ ఉంది. బుద్ధదంత ధామమయమైన మహాస్థూపం, విశాలమైన వివిధ భిక్షువిహారాలు ఉన్నాయి. వీటన్నింటితో ఇక్ష్వాకుల రాజధానిగా విలసిల్లిన విజయపురి ప్రాంతం సాగర్‌లో ముంపునకు గురి కాకుండా కేంద్ర పురావస్తు శాఖ వారు అక్కడ విశేష సామగ్రిని పరిరక్షించి, నేడు నాగార్జున కొండలో ప్రదర్శిస్తున్నారు.

### హారతీ దేవాలయం

విశ్వవిద్యాలయానికి కొద్దిదూరంలో హారతీ దేవాలయం దాని దిగువన చతురస్రాకారంలో ఒకపెద్ద సరస్సు ఉంది. దీనికి నలువైపుల మెట్లతో ఒడ్డు ప్రాంతాలున్నాయి. హారతీ దేవాలయంలో ప్రవేశానికి ముందు ఈ సరస్సులో స్నానమాచరించేవారు.

### నాగార్జున కొండకు ఇలా చేరుకోవాలి..

నాగార్జునకొండకు వెళ్లాలంటే విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి 14కి.మీ. దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. నాగార్జున సాగర్ పరిధిలోని విజయపురిసౌత్‌లో లాంచీస్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టిక్కెట్టు ధర రూ.200, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, 6 నుంచి 12 సంవత్సరాల చిన్నారులకు లాంచీకు రూ.150, మ్యూజియం సందర్శనకు 14 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీటిక్కెట్‌పై 20 శాతం రాయితీని పర్యాటకశాఖ ఇస్తుంది. ఇతర వివరాలకు లాంచీస్టేషన్ ఫోన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

### మహా చైత్యం

ఇది బుద్ధ దాతువుపై కట్టిన అందాల చైత్యం. ఈస్థూపం నుంచి తవ్వి తీసిన ధాతువును ప్రస్తుతం బుద్ధుడు మొదటి ప్రసంగం చేసిన సారనాథ్‌లో ఉంచి, పూజిస్తున్నారు. ఇది శారీరక స్థూపాల జాతికి చెందినది. దీని అంతర్భాగంలో బుద్ధభగవానుని అస్థికలు అమర్చబడ్డాయి. ఇది ప్రాచీన శిల్ప నిర్మాణ ప్రావీణ్యానికి నిదర్శనం. చక్రము దాని ఆకులను ఇటుక గోడల్లా నిర్మంచి ఆకుల మధ్య ఖాళీ స్థలాన్ని మట్టితో కప్పి స్థూపాకారాన్ని తయారు చేసి ఉపరితలాన్ని చుట్టుపక్కల పాలరాతి పలుకలతో కప్పి అర్థగోళాకారంగా అందంగా నిర్మించారు.

### ప్రాచీన విశ్వవిద్యాలయం

ఈ విశ్వవిద్యాలయం శిథిల అవశేషాలు నాగార్జునకొండ లోయలో ఏవిధంగా ఉండేవో అదే విధంగా ఆ ఇటుకలతోనే అనుపు వద్ద అమర్చారు. కృష్ణానది తీరాన విశాలమైన విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం నెలకొని ఉండేది. ఇది ప్రాచీన కాలపు గురుకులమై గురుశిష్య నివాసాలు ఒకేదగ్గరుండి సకల శాస్త్ర విజ్ఞాన కేంద్రమై, ప్రపంచఖ్యాతి గాంచింది.

### ఎత్తిపోతల సోయగం

సాగర్‌కు 15 కి.మీ. దూరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో చంద్రవంక నదిపై సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతం. ఇది 70 అడుగుల పైనుంచి జాలువారే జలపాతం. పర్యాటకుల మనస్సును ఇట్టే ఆకర్షిస్తుంది. పూర్వకాలంలో యతులు తపస్సు చేసుకునే ప్రాంతం కావటంతో ఎత్తిపోతల అనే పేరు వచ్చింది. పెద్దలకు రూ.30 పిల్లలకు రూ.20 ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. సాగర్‌నుంచి ముగ్గురు నలుగురు కలిసి ఆటో మాట్లాడుకోని వెళ్లాలి.

# జలదిగ్బంధం!

### పాక్‌కు ఇక చుక్కలే
### సింధూ, ఉపనదులపై నిర్మాణాలు
### తక్షణం డ్యామ్‌ల సామర్థ్యం పెంపు
### ఆ దిశగా మూడంచెల వ్యూహం



దశాబ్దాల నాటి సింధూ నదీజల ఒప్పందాన్ని పక్కన పెడుతూ భారత్ కొట్టిన దెబ్బతో ఆర్థికంగా పాకిస్తాన్ నడ్డి విరిగినట్టేనని చెబుతున్నారు. కొందరు చెబుతున్నట్టుగా దీని ప్రభావం పూర్తిస్థాయిలో కనిపించేందుకు దశాబ్దాలేమీ పట్టదని జల వనరుల నిపుణులు అంటున్నారు. పాక్‌పై తక్షణ ప్రభావం చూపేందుకు పలు మార్గాలున్నాయని వారు చెబుతున్నారు. దీన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. సింధూ నదిపై డ్యాముల సామర్థ్యాన్ని పెంచనున్నట్టు వెల్లడించాయి. అందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నాయి. జీలం తదితర సింధూ ఉపనదుల విషయంలో కూడా ఇదే వ్యూహం అమలవుతుందని తెలిపాయి. వీటితో పాటు కొత్తగా డ్యాములు తదితరాల నిర్మాణం వంటివి కూడా శరవేగంగా జరిపే యోచన ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే చినాబ్ బేసిన్‌లో పలు డ్యాములు, ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అవి పూర్తయ్యేందుకు ఐదేళ్ల దాకా పట్టవచ్చని అంచనా. తాజా పరిణామాల నేపథ్యంలో వాటన్నింటినీ శరవేగంగా పూర్తి చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### పాక్‌కు సమాచారం

తొమ్మిదేళ్ల సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం భారత్, పాక్ నడుమ 1960లో సింధూ జలాల ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తూర్పుకు పారే సట్లెజ్, బియాస్, రావి నదీ జలాలు భారత్‌కుబీ పశ్చిమానికి ప్రవహించే సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలు పాక్‌కు చెందాయి. సింధూ జలాల్లో 20 శాతం భారత్‌కు, 80 శాతం పాక్‌కు దక్కేలా అంగీకారం కుదిరింది. ఆ ఒప్పందాన్ని పక్కన పెడుతున్నట్టు పాక్‌కు కేంద్రం లాంఛనంగా వర్తమానమిచ్చింది. కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈ మేరకు పాక్ జల వనరుల శాఖ కార్యదర్శికి ఇప్పటికే లేఖ రాశారు. జమ్మూ కశ్మీర్‌ను లక్ష్యం చేసుకుని పాక్ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతోందని అందులో ఘాటుగా దుయ్యబట్టారు. "ఏ ఒప్పందానికైనా పరస్పర విశ్వాసమే పునాది. దానికే మీరు తూట్లు పొడుస్తున్నారు. మీ దుశ్చర్యలు సింధూ ఒప్పందం కింద భారత్‌కు దఖలుపడ్డ హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. కనుక సింధూ ఒప్పందాన్ని గౌరవించాల్సిన అవసరం భారత్‌కు ఎంతమాత్రమూ లేదు" అని కుండబద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో పాక్ అంగీకారంతో నిమిత్తం లేకుండా సింధూ, దాని ఉపనదులపై ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు వాటి జలాలను భారత్ తోచిన రీతిలో వాడుకునే వీలుంది. వాటికి సంబంధించి దాయాదికి ఎలాంటి ముందస్తు సమాచారమూ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండదు. దీనిపై పాక్ తీవ్రంగా ఆక్రోశించడం, నీటిని ఆపే చర్యలను తమపై యుద్ధ ప్రకటనగా భావిస్తామంటూ బీరాలు పలకడం తెలిసిందే.

### చుక్క కూడా వదిలేది లేదు
### కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్
### అతి త్వరలో సమగ్ర వ్యూహం
### ప్రధాని ఆదేశాలిచ్చినట్టు వెల్లడి
### సింధూ ఒప్పందంపై సమీక్ష
### అమిత్ షా తదితరుల హాజరు

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు చుక్క నీటిని కూడా వదలబోమని కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ స్పష్టం చేశారు. "ఆ దిశగా సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తున్నాం. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే పలు సూచనలు చేశారు. స్పష్టమైన ఆదేశాలిచ్చారు" అని వెల్లడించారు. సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ నేపథ్యంలో ఈ విషయమై చేపట్టాల్సిన తదుపరి చర్యల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. పాటిల్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు అందులో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధాని ఆదేశాల అమలుకు చేపట్టాల్సిన చర్యలపైనే భేటీలో ప్రధానంగా చర్చించినట్టు వివరించారు. అమిత్ షా కూడా పలు సూచనలు చేసినట్టు తెలిపారు. ఈ దిశగా స్వల్ప, దీర్ఘకాలిక చర్యలు చేపడుతూ మూడంచెల వ్యూహంతో కేంద్రం ముందుకు సాగనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# భూతల స్వర్గం మళ్ళీ వెలవెల!

- పర్యాటకుల విశ్వాసాన్ని దెబ్బతీసిన కశ్మీర్ ఉగ్ర దాడి
- ఒక్క రోజులోనే 90% బుకింగ్స్ రద్దు చేసుకున్న వేలాది మంది పర్యాటకులు
- ఇప్పటికే అక్కడ పర్యటిస్తున్న టూరిస్టులు సైతం హోటళ్లు ఖాళీ చేసిన వైనం
- నాలుగేళ్లుగా పుంజుకుంటున్న పర్యాటక రంగంపై నీలినీడలు
- ప్రశ్నార్థకంగా మారిన 2.5 లక్షల మంది కశ్మీరీల జీవనోపాధి
- అగమ్యగోచరంగా రూ. 12 వేల కోట్ల టూరిజం పరిశ్రమ భవితవ్యం

భూతల స్వర్గంగా పేరుగాంచిన అందాల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న అక్కడి పర్యాటక రంగాన్ని మళ్లీ సంక్షోభంలోకి నెట్టేసింది. పహల్గాంలో ముష్కరులు 26 మంది టూరిస్టులను అత్యంత పాశవికంగా హతమార్చడం పర్యాటకుల విశ్వాసాన్ని దారుణంగా దెబ్బతీయడమే కాకుండా దాదాపు 2.5 లక్షల మంది కశ్మీరీల జీవనోపాధి, కశ్మీర్ లోయ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ప్రశ్నార్థకం చేసింది. మళ్లీ పర్యాటకుల్లో మునుపటి విశ్వాసం, ఉత్సాహం నెలకొనాలంటే ఎన్నేళ్లు పడుతుందోనని టూరిజం వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.



### హోటళ్లన్నీ ఖాళీ..

ఈ నెల 22న పహల్గాం సమీపంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి ప్రభావంతో కశ్మీర్‌లో పర్యటించేందుకు సిద్ధమైన వేలాది మంది పర్యాటకుల్లో దాదాపు 90 శాతం మంది 24 గంటల వ్యవధిలోనే విమాన టికెట్లు రద్దు చేసుకున్నారు. మరోవైపు ఇప్పటికే కశ్మీర్ సందర్శనకు వచ్చిన పర్యాటకులు రాత్రికి రాత్రే హోటళ్లు, క్యాబ్‌ల బుకింగ్‌లు కూడా పెద్ద ఎత్తున రద్దు కావడం మొదలయ్యాయి. ఇప్పట్లో పర్యాటక పరిశ్రమ కోలుకొనే అవకాశమే లేదని ఓ ట్రావెల్ ఏజెంట్ వ్యాఖ్యానించారు. 'మొన్నటివరకు పర్యాటకులతో కళకళలాడిన మా హోటల్ ఇప్పుడు వెలవెలబోతోంది. అసలైతే గదులన్నీ వచ్చే నెలకు కూడా బుక్ అయ్యాయి. కానీ రాత్రికి రాత్రే పరిస్థితి ఒక్కసారిగా తల్లకిందులైంది. టూరిస్టులంతా భయంతో గదులు ఖాళీ చేసి వెళ్లిపోయారు' అని ఓ హోటల్ యజమాని వాపోయారు.

### కేంద్రం చర్యలన్నీ బూడిదపాలు..

కశ్మీరీలకు పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. జమ్మూకశ్మీర్ వార్షిక పర్యాటక పరిశ్రమ విలువ దాదాపు రూ. 12 వేల కోట్లు. దీని విలువ 2030 నాటికి రూ. 30 వేల కోట్లకు పెరుగుతుందని అంచనా. జమ్మూకశ్మీర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని కేంద్రం 2019లో రద్దు చేయడంతోపాటు రాష్ట్ర హోదా తొలగించి జమ్మూకశ్మీర్‌ను లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసింది. అలాగే ఏటా స్థానికంగా దాదాపు 50 వేల మందికి ఉపాధి కల్పించేలా, ఐదేళ్లలో రూ. 2 వేల కోట్ల వార్షిక పెట్టుబడులను ఆకర్షించేలా 2020లో ప్రత్యేక పర్యాటక పాలసీని తీసుకొచ్చింది. దీనికితోడు మౌలిక సదుపాయాల మెరుగుదల, విమాన కనెక్టివిటీ, విదేశీ పర్యాటకులకు ఆన్–అరైవల్ వీసా, 75 కొత్త పర్యాటక ప్రదేశాలు, 75 కొత్త వారసత్వ/సాంస్కృతిక ప్రదేశాలు, 75 కొత్త సూఫీ/మత ప్రదేశాల స్థాపన కోసం రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించింది. కశ్మీర్‌ను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో నేరుగా అనుసంధానించడానికి రైల్వే కూడా కసరత్తు ప్రారంభించింది. ప్రీమియం రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇందులో ఉంది. కేంద్రం చర్యలతో 2020 నుంచి కశ్మీర్ లోయను సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 2024 నాటికి పర్యాటకుల సంఖ్య సుమారు 2.36 కోట్లకు చేరుకుంది. కానీ ఇప్పుడు ఉగ్రవాద దాడితో అక్కడి పర్యాటక రంగం చుట్టూ సంక్షోభం ముసురుకుంది.

## పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సమీక్ష



కాకినాడ : కాకినాడ జిల్లాలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఆర్ అండ్ బి రోడ్ల పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోర్టుల సందర్శన నేపథ్యంలో జిల్లాకు విచ్చేసిన మంత్రిని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రాహుల్ మీనా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోర్టులు భూసేకరణ, నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు. జిల్లాలో ఆర్ అండ్ బి రోడ్ల పురోగతి, వాటి స్థితిగతులు, భూసేకరణ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్ అండ్ బి శాఖ, పోర్టుల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం తొండంగి మండలం పెరుమల్లాపురం కాకినాడ గేట్వే పోటు లిమిటెడ్ పనులను మరిటైన్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, పోర్ట్ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పర్యటించారు.

## భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాక్ ప్రధాని షెహబాబ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు అంటూ కామెంట్స్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని, నదుల విషయంలో కూడా నీటిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాక్ ప్రధాని షరీఫ్ మాట్లాడుతూ..'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం. పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశం కరెక్ట్ కాదు. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు. చివరగా.. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ చెప్పుకొచ్చారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు.ు

## ట్రంప్ యూటర్న్.. అమెరికాలో విదేశీ విద్యార్థులకు గుడ్‌న్యూస్




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కోర్టు ఆదేశాల మేరకు విదేశీ విద్యార్థుల బహిష్కరణపై ట్రంప్ వెనక్కి తగ్గారు. తమ వీసాలు రద్దు చేయడంతో విదేశీ విద్యార్థులు అక్కడి న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో, విద్యార్థులకు అనుకూలంగా తీర్పులు రావడంతో ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. వివరాల ప్రకారం.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు ఊరట లభించింది. అయితే, అమెరికాలో విదేశీ విద్యార్థులపై ట్రంప్ బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తమ వీసాల రద్దుపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. అనంతరం.. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ట్రంప్ యంత్రాంగం చర్యలను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు. దీంతో ఆయా విద్యార్థులకు చట్టబద్ధ హోదా లభిస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. విదేశీ విద్యార్థులపై బహిష్కరణ వేటు కారణంగా డిపోర్టేషన్, నిర్బంధం ముప్పు పొంచి ఉండటంతో ఆ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. తాజాగా కోర్టు వ్యాఖ్యలతో ట్రంప్ సర్కారు వెనక్కి తగ్గింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆస్తుల వేలం



అమరావతి : ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.310 కోట్ల రుణం తీసుకుని తిరిగి చెల్లించడంలో విఫలమైన వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆస్తుల వేలం ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రేణుక, ఆమె భర్త నీలకంఠం కలిసి 2018లో 15 ఏళ్ల కాలానికిగాను రూ. 310 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణాన్ని బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ కార్యకలాపాలకు వినియోగించారు. ఐదేళ్ల క్రితం వరకు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించారు. మొత్తం రూ.40 కోట్ల వరకు తిరిగి చెల్లించారు. అయితే, ఆ తర్వాతి నుంచి చెల్లింపులు నిలిపివేశారు. అసలు, వడ్డీ కలిపి ఇంకా దాదాపు రూ.340 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే, వడ్డీ భారం ఎక్కువగా ఉండటంతో కొన్ని ఆస్తులు విక్రయించి రుణం రీ షెడ్యూల్ చేయాలని వారు కోరారు. అయితే, ఈ ప్రతిపాదన నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో హెచ్ఎఫ్ఎల్ దీనిని అంగీకరించలేదు. రుణం తీసుకున్న మొత్తానికి నెలసరి వాయిదా రూ.3.4 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ మొత్తం భారంగా మారడంతో ముందుగా తక్కువ మొత్తం తీసుకుని, చెల్లింపు మొత్తాన్ని క్రమేణా పెంచాలని ప్రతిపాదించారు. దీనికి కూడా హెచ్ఎఫ్ఎల్ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో వాయిదాల చెల్లింపు నిలిచిపోవడంతో ఎన్‌సీఎల్‌టీని హెచ్ఎఫ్ఎల్ ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ కేసు పెండింగ్‌లో ఉంది. రుణ నిబంధనలకు అనుగుణంగా ఉన్న హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని 5 వేల గజాల ఆస్తిని రూ.145 కోట్లకు వేలం వేయగా ఎవరూ ముందుకు రాలేదు. మాదాపూర్‌లోని 7,205 చదరపు గజాల్లో ఉన్న బుట్టా కన్వెన్షన్ వేలానికి కూడా స్పందన రాలేదు. దీంతో అధికారులు మళ్లీ వేలానికి ప్రయత్నిస్తున్నారు.

### గగనతలంపై పాక్ నిషేధ ఫలితం
### విమానయాన సంస్థలపై అదనపు భారం
### అదనపు వ్యయం, ప్రయాణ సమయంతో ప్రయాణికులకు ఇబ్బందులు
### విదేశాలకు ప్రయాణ చార్జీలు 8 నుంచి 12 శాతం పెరిగే అవకాశం

## అంతర్జాతీయ ప్రయాణం .. మరింత భారం



పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం దాయాదీ దేశం పాకిస్తాన్‌పై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. పాకిస్తాన్ సైతం అదే రీతిలో స్పందిస్తూ తమ గగనతలాన్ని భారతదేశ విమానాలు ఉపయోగించుకోకుండా నిషేధించింది. ఇండియా విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలపై అదనంగా ఆర్థిక భారం పడుతోందని, అతిమంగా ప్రయాణికులే భరించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఉత్తర భారతదేశం నుంచి పాక్ గగనతలం గుండా ప శ్చిమ దేశాలకు ప్రయాణించాల్సిన విమానాలు ఇక చుట్టూ తిరిగి వెళ్లక తప్పదు. దీనివల్ల విమాన చార్జీలు 8 నుంచి 12 శాతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యూరప్, ఉత్తర అమెరికా, మధ్య ప్రాచ్య దేశాలకు వెళ్లేవారు అదనపు భారం భరించాల్సి ఉంటుంది. కొన్ని ముఖ్యమైన అంతర్జాతీయ రూట్లలో విమాన ప్రయాణాలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. ఇండియాలో రిజిస్టర్ అయిన అన్ని విమానాలతోపాటు భారతీయుల యాజమాన్యంలో ఉన్న విమానాలు పాక్ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదు.

### ఇక సుదూర ప్రయాణాలే

పాక్ ఆంక్షల ప్రభావం ఇప్పటికే మొదలైందని ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి సంస్థలు నిర్ధారించాయి. తమ అంతర్జాతీయ విమానాలను మరో మార్గం గుండా మళ్లించామని తెలిపాయి. తమ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాక్ ఆంక్షల విషయంలో తాము చేయగలిగేది ఏమీ లేదని నిస్సహాయత వ్యక్తంచేశాయి. ఇండియా నుంచి యూరప్, అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల రెండు నుంచి రెండున్నర గంటల అదనపు సమయం పడుతోందని ఓ పైలట్ చెప్పారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి తదితర నగరాల నుంచి ప్రయాణించేవారు అదనపు సమయం వెచ్చించడంతోపాటు అదనపు వ్యయం భరించాల్సి వస్తోంది. ఇండియా విమానాలకు పాకిస్తాన్ ఎయిర్‌స్పేస్ అత్యంత కీలకం. చాలావరకు విమానాలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ఇన్నాళ్లూ ఎటువంటి ఇబ్బందుల లేకుండా ప్రయాణాలు సాగిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఏ విమానానికి ఎంత సమయం అదనంగా అవసరమన్న దానిపై త్వరలో పూర్తి స్పష్టత వస్తుందని సీనియర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఒకరు తెలిపారు.

### కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం

రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమాన ప్రయాణాలు మరింత ఖరీదు కాబోతున్నాయి. విమానాలు ఎక్కువ దూరం ప్రయాణిస్తే ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతాయి. అదే స్థాయిలో టికెట్ చార్జీలు పెరగడం తథ్యం. విమానయాన సంస్థలు తమపై పడే అదనపు వ్యయాన్ని ప్రయాణికులకే బదిలీ చేస్తాయి. మరో ఇబ్బంది ఏమిటంటే.. ప్రయాణానికి అదనపు సమయం పట్టడం వల్ల ఇతర దేశాల్లో కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం కావొచ్చు. అందుకే ప్రయాణ ప్రణాళికను రీషెడ్యూల్ చేసుకోవాలి. విదేశాల నుంచి వచ్చేవారు కూడా ఆలస్యంగా స్వదేశానికి చేరుకుంటారు. లాంగ్ జర్నీ వల్ల విమానాల్లో ఇంధనం లోడ్ పెరుగుతుంది. ఎక్కువ ఇంధనాన్ని నింపుకోవాలి. ప్రయాణ సమయానికి అనుగుణంగా భద్రతాపరమైన ప్రమాణాలు కూడా పాటించాలి. పేలోడ్‌ను తగ్గించుకోవాలి. అంటే తక్కువ మంది ప్రయాణికులు, తక్కువ లగేజీతో ప్రయాణించాలి. దీనివల్ల విమానాల్లో సీట్లు లభించడం కష్టమవుతుంది. ఓవర్‌బుకింగ్ వంటి పరిణామాలు ఎదురవుతాయి. ముందస్తు ప్రణాళిక ఉంటే తప్ప అంతర్జాతీయ విమానాల్లో అప్పటికప్పుడు సీట్లు దొరకవు. భారత విమానాలకు తమ గగనతలాన్ని పాక్ మూసివేయడం ఇదే మొదటిసారి కాదు. 2019 ఫిబ్రవరిలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది. భారత సైన్యం చేపట్టిన బాలాకోట్ వైమానిక దాడుల నేపథ్యంలో తమ గగనతలం గుండా భారత విమానాలు ప్రయాణించకుండా నిషేధించింది. ఈ నిషేధం కొన్ని నెలలపాటు కొనసాగింది. ఇప్పట్లో భారత ప్రయాణికులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి.

### ఇప్పుడు చేయాల్సిందేమిటి?

పాక్ ఆంక్షల కారణంగా విమానయాన చార్జీలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది కాబట్టి సాధ్యమైనంత త్వరగా టికెట్లు బుక్ చేసుకోవాలి.విమానాల విషయంలో అప్‌డేట్స్ కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్ లేదా యాప్‌ను తరచూ చెక్ చేసుకోవాలి. అంతర్జాతీయ ప్రయాణాలకు అదనపు సమయం కేటాయించేందుకు సిద్ధపడాలి. తదనుగుణంగా పక్కా ప్లానింగ్ ఉండాలి.ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రయాణికుల లగేజీపై పరిమితి విధించే అవకాశం కనిపిస్తోంది. కనుక తక్కువ లగేజీతోనే ప్రయాణించాలి.

## కార్పొరేట్ సంస్థలకు కళ్లెం




ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది. ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది. కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

## నిప్పుల కొలిమి



భానుడి ఉగ్రరూపంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. అగ్నిగుండమవుతున్నది. ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీలు దాటాయి. మనుషుల మాడు పగిలేంత తీవ్రత కనిపిస్తున్నది. ఒకవైపు సూర్యుడి ప్రతాపం, మరోవైపు అకాలవర్షాలతో వింత వాతావరణం నెలకొంది. ఎండలు సాధారణ జనాన్ని భయపెడుతున్నాయి. ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. గత రెండునెలల్లో వడదెబ్బతో దాదాపు 23 మంది చనిపోగా, గత బుధవారం ఏడుగురు, గురువారం నలుగురు మృతి చెందడం గమనార్హం. ఫిబ్రవరి నుంచే భానుడు భగభగ లాడుతున్నాడు. సాధారణం కన్నా ఎండవేడి విపరీతంగా పెరిగింది. 2022లో ఉష్ణోగ్రత 32 డిగ్రీలు ఉండగా, 2024 వచ్చేసరికి 45 డిగ్రీలకు పెరిగింది. ఈఏడాది అది కూడా 0.5డిగ్రీలు పెరిగి 45.5 డిగ్రీలకు చేరింది. దీనికి పర్యావరణంలో నిత్యం చోటు చేసుకుంటున్న విపరీతధోరణులే కారణం. ఫసిఫిక్ మహాసముద్రంలో 'లా నినా'తో నీటి ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 'ఎల్ నినో'కు ఇది భిన్నం. లా నినా ప్రక్రియలో జాప్యం మూలంగా వచ్చే జూన్‌లో వర్షాలు సైతం ఆలస్యమయ్యే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ అంచనా. లా నినా సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో తగ్గుతుంది. సాధారణంగా తక్కువ వర్షపాతం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా తగ్గవచ్చు. ఇది పంటలపై ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం.ఈ పరిస్థితుల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే దిశగా చర్యలు తీసుకోవడంలో ఆయా సర్కారీ శాఖలు అప్రమత్తంగా ఉన్నట్టుగా కనిపించడం లేదు. ఎండల సమస్య రాష్ట్రానిదేగాక, దేశంతోపాటు ప్రపంచానిది కూడా. అసలు ఎండలకు కారణమెంటో విస్తృత అధ్యయనం అవసరం. మూలాలను వెతికిపట్టుకోవాలి. ఇష్టారాజ్యంగా అడవుల నరికవేత, అభివృద్ధి పేర కుంటలు, చెరువుల పూడ్చివేత, కొండల తొల్చివేత పర్యావరణానికి ముప్పును తెస్తున్నాయి. ఈ పరిస్థితి మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చెట్ల నరికివేత, వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నేవీ రాడార్ కేంద్రం కోసం వేలాది చెట్లను అడ్డంగా తొలగిస్తున్న వైనం తెలిసిందే. ప్రకృతికి ఆలవాలం, దేశానికి వన్నె అయిన హిమాలయాల్లోనూ రోడ్లు, ఇతర సౌకర్యాల కోసం చెట్లను నిర్దాక్షిణ్యంగా పడేస్తున్నారు. ఇష్టా రీతిన వ్యవహరిస్తు న్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏడాదికోసారి మొక్కలు నాటడంతోనే సరి పోదు. పచ్చదనం పెంచే కార్యక్రమాలు విరివిగా జరగాలి. నిరంతర ప్రాధాన్యత, పర్యవేక్షణ ఉండా లి.ప్రభుత్వాలు అప్రమ త్తంగా ఉండి, పట్టించుకుంటేనే ప్రకృతి కరుణిస్తుంది. బీభత్సాలు జరగవు. తద్వారా జీవవైవిధ్యానికి ప్రమాదముండదు. కాగా ఎండల నేపథ్యంలో రుతుపవనాలు, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వానాకాలం పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ రైతులకు సలహా ఇస్తున్నది. ఎండాకాలంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. కాగా ప్రజల అవసరాలను నెరవేర్చడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిన్నకుంటున్నాయి. గత రెండేండ్లతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో మరింత ఎక్కువగా వేడి నమోదయ్యే పరిస్థితులు ఉన్నాయనేది వాతావరణ శాఖ అవగాహన.ఇక భానుడి ప్రతాపానికి 'అమ్మో ఎండలు' అంటూ సాధారణ జనం ఇండ్ల నుంచి బయట కొచ్చేందుకు జంకుతున్నారు. నెత్తిమీద గొడుగు పెట్టుకుని, టోపీలు ధరించి అవసరమైతేనే రోడ్డుమీదకొస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలు మోతమోగిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నిప్పులకుంపటవుతున్నది. పట్టపగలే రోడ్లు నిర్మానుష్యమ వుతున్నాయి. జాగ్రత్తలు పాటించాలంటూ వాతావరణ శాఖ తరచూ హెచ్చరిస్తున్నది. ఇదిలా ఉంటే, అకాలవర్షాలతో వరి, మొక్కజొన్న, మామిడి, మిర్చి తదితర పంటలు సుమారు లక్ష ఎకరాల్లో నష్టం జరిగింది. వడగండ్ల వాన, ఈదురుగాలులతో పంటలు దెబ్బతినడం, విద్యుత్ తీగలు తెగిపడటం జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.1100 కోట్ల మేర పంటనష్టం జరిగినట్టు సర్కారీ నివేదికలే చెబుతున్నాయి. పరిహారంగా రైతులకు ఆహార ధాన్యపు పంటలకు ఎకరాకు రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేలివ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాగా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందన లేదు. తాగునీటి వసతుల్లేక వన్యప్రాణులు, మూగ జీవాల పరిస్థితి దారుణంగా మారింది. ఎండలు, ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. తీవ్రమైన ఎండలవేడితో ఉపాధి హామీతోపాటు సాధారణ రోజూ కూలీలు, ఉద్యోగులు, వీధి వ్యాపారులు, పంచాయతీ, మున్సిపల్, నిర్మాణరంగ, కరెంటు తీగలమీద పనిచేసే కార్మికులతోపాటు ఇతరులూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అందుకే పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం కావాలి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com